డిసెంబర్ - 2017

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక


**ప్రధాన సంపాదకులు :**

**రెవ.డా॥ కె. జోసఫ్**

**సర్క్యులేషన్ :**

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 200/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

ఫోన్: 08592-231281

సెల్ : 9704255416



**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| క్రిస్మస్-యేసు ఎక్కడ? | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 05 |
| క్రైస్తవులు భయపడతగునా | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| ఎలీసబెతు | శ్రీమతి రేచల్ జోసఫ్ | 08 |
| ఏడు సంఘాలు | బ్రదర్ కె. సామ్రాట్ | 10 |
| క్రిస్మస్-మహాపండుగ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 12 |
| దేవుని ఇంటిలో అర్హమైన పాత్ర | శ్రీమతి మాధురిమరియన్ | 14 |
| ఆచార్య ఆరార్కే మూర్తి | సాక్ష్యము | 16 |
| క్రిస్మస్-వాస్తవగాథ | మామయ్య కథలు<br>రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 18 |
| గొఱ్ఱెల కాపరులు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 23 |



**INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP**

**EVANGELISM**
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

**RELIEF**
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు,

'పరిశుద్ధత' మాస పత్రికను ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. దేవుని కృపలో మరొక క్రిస్మస్ వరకు దేవుడు మనలను కాపాడి మరో నూతన సంవత్సరాన్ని కూడా చూడ్డానికి కృప అను గ్రహించాడు. మీరు, మీ పిల్లలు అంతా సంతోషంగా ఉన్నారని, ఉంటారని విశ్వసిస్తున్నాను. మాపై చూపుతున్న ఆదారాభిమానాలకు మేము ఎంతో సంతోషిస్తున్నాము. మీరు వ్రాసే ఉత్తరాలు, చేసే ఫోన్‌కాల్స్ మాకెంతో ప్రోత్సాహానిస్తున్నాయి.

క్రిస్మస్ సర్వమానవాళికి పండుగ దినము. కులాలకు, మతాలకు అతీతమైనది. ఎందుకంటే ఆయన జన్మించిన సమయములో దేవదూతలు "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయనకిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానము కలుగును గాక" అని దేవదూతలు స్తుతించారు. గొర్రెల కాపరులు దేవదూత ద్వారా "ప్రజలందరికీ కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియుజేయుచున్నాను. దానికిదే మీకానవాలు. ఒక శిశువు పొత్తిగుడ్డలతో పరుండియుండుట మీరు చూచెదరు" అని కబురందుకొని వెళ్ళి ఆ శిశువును దర్శించారు. తాము కూడా దేవునికి స్తోత్రము చేయుచూ వెళ్ళిపోయారు. ఎప్పటినుండో నిరీక్షిస్తూ, ఎక్కడో దూరాన్నుండి బయలుదేరి ఒంటెల మీద బంగారు, సాంబ్రాణి, బోళము వంటి విలువైన వస్తువులతో బయలుదేరి నక్షత్రము దారిచూపగా బాలుడైన యేసుక్రీస్తును కనుగొని ఆయనను పూజించారు తూర్పు దేశపు జ్ఞానులు. అందుకే ఇది సర్వమానవాళి పండుగ. మీరు మీ ఇరుగు పొరుగు వారితో, క్రైస్తవేతరులతో కలసి ఈ సంతోషాన్ని పంచుకోవలసినదిగా కోరుతున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. **K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890.** మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు **9440217726** నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–ఎడిటర్

## క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

2

## (అపొస్తలుడు మూడవభాగం)

– కొడవటికంటి

సాయంకాలం నాలుగు గంటలకు స్నానము చేసి లోపలికి వస్తున్న మనుమడిని చూస్తూ ఉంది లోయి. అరవై అయిదు సంవత్సరాల వయస్సులోనూ ఆమె ఇంట్లో పనులు చేసుకుంటుంది. ఆమె ఆరవ ప్రాణం ఈ మనుమడే. తన అల్లుడు చిన్న వయసులోనే మరణించినప్పటికీ తన కుమార్తె యునీకే స్వయంగా బాధ్యత తీసుకుంది. అందువలన ఈ మనుమని ఎంతో ముద్దుగా పెంచింది. తను తార్సు రాక ముందు తన దేవుడైన యెహోవా మీదున్న విశ్వాసం ఏ మాత్రం లోపించ లేదు. పైగా పది సంవత్సరాల క్రితం పౌలు ద్వారా పరిచయం చేయబడిన మెస్సయ యొక్క ధ్యానములో ఆయన శిలువ మరణానుభవములో పాలుపొందవలెనని తను హృదయ పూర్వకంగా కోరుకుంది. ప్రభువు దయవలన తన కుమార్తె కూడా ఈ మార్గంలోనే ఉంది. ఆరు సంవత్సరాల క్రితం పౌలు ఈ పట్టణంలోనే రాళ్ళతో కొట్టబడి, మరణించబడినట్లు నిర్ధారించి ఊరి బయటకు ఈడ్వబడి, ప్రభువు కృప వలన బ్రతికినప్పుడు తన ఇంటికే వచ్చాడు. అప్పుడే తన మనుమడు తిమోతి ప్రభువును తన స్వరక్షకునిగా అంగీకరించాడు.

ఆనాటి నుండి తన ఇంటి స్వరూపమే మారిపోయింది. తార్సు వెళ్లి ఉన్నత విద్య అభ్యసింపవలెనని ఉబలాటపడిన తిమోతి చదువుకు స్వస్తి చెప్పి ఎప్పుడూ శిష్యుల సహవాసం లోనే సమయం గడుపుతూ అప్పుడప్పుడు ప్రక్క గ్రామాలకు వెళ్ళి సువార్త ప్రకటించి ప్రార్ధన కూటాలు నిర్వహిస్తున్నాడు. నిజంగా ఈ వయస్సులో ప్రభువును హత్తుకొనకపోతే తన కుమార్తె, మనుమడు ఈ లోకంలో పడిపోయి చుట్టుప్రక్కల వారివలెనే దుఃఖకరమైన జీవితం గడుపుతూ ఉండేవారు.

దుస్తులు మార్చుకొని తల దువ్వుకుంటున్న మనుమని చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటుంటే...

"ఏంటవ్వా నవ్వుకుంటున్నావు?" అని అడిగాడు తిమోతి.

"అదే, నీకు ఇప్పుడు పెండ్లి చేస్తే ఎలాగుంటుందా?" అని అంది.

అవ్వ వైపు చూస్తూ "నిజంగానే అలా అనుకుంటున్నావా?" అన్నాడు తిమోతి.

"లేదులే, నీకొక విషయం చెపుదామని" అంది చిన్నగా.

"ఏంటవ్వా అది" అని దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. లోయి నవ్వుకుంటూ నిశ్శబ్దంగా ఉంది.

"చెప్పవ్వా, మేము సున్నీముకు ప్రార్ధనకి వెళ్తున్నాము" అన్నాడు.

"ఇప్పుడు మీరు ఊరికి వెళ్ళడం లేదు" అంది ముక్త సరిగా, తను అల్లుతున్న లేసు దారం సరి చేసుకుంటూ.

"ఎందుకని" అని అడిగి, కొంచెం దగ్గరగా జరిగి "చెప్పవా" అన్నాడు బ్రతిమాలుతున్నట్లు.

"ఎందుకంటే..." అని ఆగింది.

"అబ్బా, చెప్పవ్వా" అన్నాడు గోముగా.

"పౌలుగారు దెర్బే వచ్చాడు" అని చెప్పింది.

తిమోతి లేచి నిలబడి అవ్వ భుజాల మీద రెండు చేతు లేసి "నిజమా, ఎప్పుడొచ్చాడు?" అని, "ఇరవైయైదు మైళ్ళ దూరంలో ఉంటే మనకు ఎందుకు తెలియదు?" అన్నాడు.

"ఉదయం ఓజెము దెర్బే నుండి వచ్చాడు. పౌలు మూడు రోజుల నుండి అక్కడ ఉన్నాడని, ఈ సాయంకాలం పొద్దుపోయిన తర్వాత ఇక్కడి వస్తాడు" అని చెప్పింది.

తిమోతి లేచి "అవ్వా, నేను మందిరం దగ్గరకెళ్ళి అందరికీ చెప్పి వస్తాను" అన్నాడు.

"నేను ఓజెముతోనే మల్కీయాకు, కీషికి కూడ కబురు చేశాను, రాత్రి బాగా పొద్దుపోయి వచ్చావు కదా అందుకని నిన్ను నిద్రలేపలేదు" అంది.

తిమోతి ముఖం సంతోషంతో వెలిగిపోతుంది. ఆరు సంవత్సరాల క్రితం పౌలుగారిని ఊరి మండపం వద్ద ఈకొనియ నుండి వచ్చిన యూదులు రాళ్ళతో కొడుతున్నప్పుడు తను చూశాడు. ఆయన ముఖం అప్పుడు కొత్తగా కనిపించింది. కొంతసేపటికి రాళ్ళు విసరుతున్న వాళ్ళు

ఆపేశారు. వారిలో ఇద్దరు పౌలు దగ్గరకు వచ్చి వంగి ఆయన మీద పడివున్న రాళ్ళను ప్రక్కకు తొలగించి, నడుము క్రిందవున్న కుడిచేయి పైకెత్తి నాడి చూచి వదిలేశారు. ఆ చెయ్యి నిర్జీవంగా పడిపోయింది. రాళ్ళు విసిరిన వారందరూ ఒక్కసారిగా ముందుకు కదిలి పౌలు దేహం చుట్టు మూగారు. మరలా ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు. ఎవరో ఇద్దరు మాత్రం పౌలు చేతులు చెరొకటి పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్ళారు. వారి వెనక దాదాపు ఇరవైమంది నడుస్తున్నారు. తను కూడ వారి వెనుకనే నడిచాడు. తన మెదడు అసలు పని చెయ్యటం మానేసింది. పౌలుని ఊరి వెలుపల వరకు ఈడ్చి వారు వెళ్లిపోయారు. తన లాగానే పౌలును ఎరిగిన కొందరు శిష్యులు కూడా తనలాగానే ఏడుస్తున్నారు. తర్వాత ఏం చెయ్యాలో అర్ధం కాలేదు. ఇంటికెళ్ళి అవ్వ లోయికి, అమ్మకి చెబుదామను కున్నాడు. కాని ఇక్కడ ఏం జరుగుతుందో, పట్టణ అధి కారులు వస్తారేమోనని అక్కడే నేలమీద కూర్చున్నాడు. పౌలు ముఖమంతా నెత్తుటి మరకలతో ఉన్నప్పటికీ నిద్రిస్తున్న వానివలె ప్రశాంతంగా ఉంది. తను ఆ విధంగా ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు. కాని పౌలు కదలినట్లు అనిపించగానే గుండె ఒక్కసారిగా ఆగినంత పనయ్యింది "ప్రభువా" అన్న స్వరం వినిపించింది. అరె, పౌలు బ్రతికాడు. పౌలు కళ్ళు తెరచి తనను చూసినప్పుడు తన కళ్ళలోని నీరు ఆయన ముఖం మసకగా కనిపించేలా చేసింది.

"తిమోతి" అని పిలిచాడు.

తను లేచి నిలబడ్డాడు. పౌలు కూడా లేచి నిలు చున్నాడు. చుట్టూ ఉన్న శిష్యులందరూ సంతోషంగా చూస్తు న్నారు. ఎవరి మస్తిష్కాలు పనిచెయ్యటం లేదు. తనకైతే ఇది కలా? నిజమా? అనిపిస్తుంది. అరె, పౌలు నడుస్తూ వెళ్తున్నాడు. తను కూడా పరుగెత్తి ఆయనను కలిసికొని నప్పుడు పౌలు తన భుజం మీద చెయ్యి వేశాడు. రక్తం బంకలాగా అంటుకుంది. వాకిట్లో పౌలును చూసి అవ్వ లోయి పెద్దగా అరచి దగ్గరకు వచ్చింది.

పౌలు రాక కోసం విశ్వాసులందరు భోజనం చెయ్య కుండా ఎదురు చూస్తున్నారు. ఆయన రాక కోసం తిమోతి వారికి భోజన ఏర్పాట్లు చేశాడు. ఆయన వెంబడి ఎందరు సహోదరులు దెర్బే నుండి వస్తారో, బర్నబాగారు కూడా వస్తారు కదా! అనుకుంటుంటే, రాత్రి తొమ్మిది గంటలకు పౌలు వచ్చాడు. అందరూ చాలా సంతోషించారు. భోజన మైన తర్వాత చాలాసేపు మాట్లాడుకున్నారు. బర్నబా తన మేనల్లుడు మార్కుతో కలసి కుప్రవైపుగా వెళ్ళాడని ప్రభువు చిత్తమైతే వారిని ఈకొనియాలో ఉన్న సంఘం వద్ద కలుసు కుంటామన్నారు.

మరునాడు ఉదయం కూటము ఏర్పాటు చేశారు. సంఘస్తులంతా వచ్చారు. ఇక్కడ నుండి వెళ్ళిన తర్వాత బర్నబాతో కలసి యెరూషలేములో తల్లి సంఘము యొద్దకు వెళ్ళటం, క్రీస్తు సంఘములో చేరిన అన్య జనాంగం విషయమై చర్చ, అక్కడ అపొస్తలుల తీర్మానాలు అన్నీ సంఘానికి వివరించాడు సీల.

మరునాడు సంఘాధ్యక్షుడిని, పరిచారకులను ఎన్ను కున్నారు. పరిచారకులలో ముఖ్యునిగా తిమోతి పేరును కొందరు పెద్దలు సూచించారు. కాని పౌలు అందుకు సమ్మతించలేదు. ఎందుకనో ఎవరికీ అర్ధం కాలేదు. సంఘ పెద్దలలో లినామి లేచి తనను గురించి చాలా విషయాలు పౌలుకి వివరించాడు. అయినా పౌలు మౌనంగానే ఉన్నాడు. లుస్త్రలోని సంఘంలో తనకు ఏ బాధ్యతా అప్పగించలేదు. తనకు కొంత నిరుత్సాహం కలిగినా పౌలుగారు మనసులో ఏమి యోచిస్తున్నారో తర్వాత తెలుసుకోవాలనుకున్నాడు తిమోతి.

Let us Celebrate Christmas with Jesus



# క్రిస్మస్ - యేసు ఎక్కడ?

ప్రభువునందు ప్రియ పరిశుద్ధత పాఠకులకు క్రిస్మస్ శుభాభివందనములు.

2015 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు అయిపోయిన తరువాత మరలా ఎప్పుడో సంవత్సరానికి కదా ఈ ప్రపంచ పండుగ అని అనుకున్నాము. క్రిస్మస్ పండుగ ఫాస్ట్‌గా వచ్చేసింది. సంవత్సరకాలం ఇట్టే గడిచిపోయింది. వచ్చేసింది... క్రిస్మస్... యేసు జన్మదిన పండుగ... వచ్చేసింది...

ప్రపంచమంతా యేసుప్రభువా నీ జన్మదిన పండుగ ఎంతో సంబరంగా చేసికొని ఆనందిస్తున్నాము అని తమ కార్యముల ద్వారా అనగా, స్టార్స్, చర్చస్ అలంకరణ, ఇండ్లకు రంగులు వేయటం, ఖరీదైన వస్త్రాలు, మంచి భోజనాలు, బంగారు నగల అలంకరణ, క్రొత్త వస్తువులు కొనుక్కోవడం వంటి లోకసంబంధమైన కార్యక్రమాల ద్వారా తెలియ జేస్తుంటాము.



అయితే ప్రాముఖ్యమైన విషయం ఏంటంటే ఈ పండుగ యేసు జన్మించిన పండుగ కనుక యేసును సంతోషపరచాలి. కానీ ఆ సంగతి ఎంతమంది గ్రహిస్తున్నారు? ఎవరి జన్మదిన వేడుకలో వారినే సంతోషపరచాలి, వారికి మంచి వస్తువులు కానుకలు, ఆభరణాలు ఇచ్చి సంతోష పరచాలి. మరి క్రైస్తవులు. మరి క్రైస్తవులు ఏంటి? యేసు జన్మదినమున ఆయనను సంతోషపరచకుండా వాళ్ళని వాళ్ళే సంతోషపరచుకుంటారు. సంతోషిస్తే పరవాలేదు కానీ, జన్మదిన కారకుడైన యేసుని బహుగా దుఃఖపరచి వాళ్ళే సంతోషిస్తున్నారు. ఇది ఎంత అన్యాయం. "అన్యాయస్తులు దేవుని రాజ్యంలో ప్రవేశింపనేరరు". ఈ పండుగ మనము అన్యాయం జరిగిస్తే పై మాట గుర్తుంచుకోండి.

అసలు మనం మనలని ఎల్లప్పుడు సంతోషింప చేసు కుంటాము కదా, ఈ ఒక్కరోజైనా యేసుని సంతోషపరచే విధంగా పండుగ చేసుకుంటే యేసు ఎంత ఆనందిస్తాడు. క్రిస్మస్ సంద ర్భంగా యేసుకి నూతన వస్త్రాలు, మంచి భోజనం, కానుకలు, ఆపదలో, ఇబ్బందులలో, అవమానములలో ఉన్నవారిని దర్శించి వారిని ఓదార్చి తగిన సహాయం చేయటం (నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించుట), బీదలకి, దిక్కులేని వారికి మంచి వస్త్రాలు, భోజనాలు ఇస్తే యేసుకే ఇచ్చినట్లు కదా. అదే దేవుడు కోరేది (యాకోబు 1:2). అలా చేస్తే దేవుడు ఎంత సంతోషిస్తాడో కదా! ఆయన సంతోషిస్తే మనకు ఎన్ని దీవెనలో. అయితే మనం యేసు జన్మదిన సందర్భంగా అధిక పాపములు చేసి ఆయనను రోజూ కంటే ఎక్కువగా దుఃఖపరుస్తున్నాము.

క్రిస్మస్ సందర్భంగా మనం దేవుని దుఃఖపరచే విషయాలు :

1. యేసుకి (పేదలకి) ఇవ్వవలసిన క్రొత్త వస్త్రాలు మనమే వేసుకుంటాము. కొంతమంది దయగలవారు పేదలకు చినిగినవి, పాతవి, పనికిరానివి పేదలకు (యేసుకి) ఇచ్చి, తాము ఖరీదైన వస్త్రాలతో అలంకరించుకుంటారు.

2. మంచి భోజనం మనకు. ఎంగిలి భోజనం అనగా మనం తినగా మిగిలిన భోజనం పేదలకి (యేసుకి).

3. త్రాగుడు, జూదము, వ్యభిచార సంబంధమైన క్రియలు ఆ రోజే ఎక్కువగా చేసి విరోధి అయిన సాతానుని సంతోషపరచి యేసుని బహుగా దుఃఖపరుస్తాము.

4. క్రిస్మస్ సందర్భంగా మంచి మంచి ఖరీదైన నగలు, వస్తు వాహనాలు ఇంటిలోనికి తెచ్చుకుంటాము కానీ యేసుని బయటనే నిలబెడతాము.

5. అసలు వెలుగైన క్రీస్తుని కాకుండా గాలికొడితే ఆరిపోయే క్యాండిల్స్‌తో సంబరపడతుంటాము (యోహాను 1).

6. క్రిస్మస్ రోజు దేవదూతలు పరలోకంలో గానం చేసి దేవుని మహిమపరచారు. ఆ సందర్భంగా మన ఇళ్ళలో చీకటి శక్తులు నాట్యం చేస్తున్నాయేమో ఆలోచించండి.

7. జన్మదిన కారకుడైన యేసు లేకుండానే క్రిస్మస్ వేడుకా? క్రీస్తులేని క్రిస్మస్ ఎంత విడ్డూరం! ఎంత అన్యాయం!

దయచేసి విజ్ఞులైన మీరందరూ ఆలోచించండి. ఈ క్రిస్మస్ అయినా క్రీస్తును సంతోషపరచే విధంగా జరుపుకుందాము. హృదయాలలో నివసించే యేసు హస్తకృత్యములలో నివసింపడు. మనం ఆలయాలని ఎంతో అలంకరించుకుంటాము కానీ, యేసు నివసించేది హృదయాలలో కనుక, మన హృదయాలను పవిత్ర పరచుకుందాము. యేసు నివసించునట్లుగా మన హృదయాలను అపవిత్రపరచే వాటిని (మార్కు 7:21) తొలగించుకొని యేసు మనలో జీవించునట్లు మన హృదయాలని పవిత్రపరచుకొని (నిర్గమ. 25:8) యేసుని సంతోషపరచి దీవెనలు పొందుదాము. యేసుని కలిగి యేసుతో క్రిస్మస్ పండుగ చేసికుందాము.



5

# క్రైస్తవులు భయపడతగునా?

రెవ.డా॥ కె.జోసఫ్

ఈ క్రింది వాక్యము మనకు చెప్పుచున్నట్లుగా దేవుడు తన వాగ్దానములను నెరవేర్చుచూ మనలను కాపాడుతుంటాడు అనే సత్యాన్ని విశ్వసించుటలో మనందరము విశ్వసించాలి.

**"భయపడుట వలన మనుష్యులకు ఉరి వచ్చును"** సామెతలు 29:25.

యెహోవా యందు నమ్మికయుంచువాడు సురక్షితముగా నుండును. భయపడే ఆత్మకు బానిసలైన ఇశ్రాయేలీయులు వారి గుడారాలములోకి వెళ్ళి రాత్రంతా ఏడుస్తూనే ఉన్నారని బైబిలు గ్రంధము చెప్పుచున్నది. భయపడే ఆత్మ ప్రతిచోట వ్యాపించింది. అది దేవునికి బాధ కలిగించింది. వారెన్నడును వాగ్దానభూమిలో ప్రవేశింపరని ఆయన కోపముతో ప్రతిజ్ఞ చేశాడు. ఈ విషయాన్ని సంఖ్యాకాండము 13:14 అధ్యాయాలలో మీరు చదవండి. సమ్మతించటము అనగా దానికి బానిస కావటం అన్నమాట. అలానే సాతానుకు బానిస అనుటయు అతను నిన్ను బానిసగానే కాక బంధించి యుంచుతాడు. అట్లయితే మీరెన్నటికిని భయపడరాదని బోధించే దేవుని వాక్య భాగాలను గ్రహించండి. దేవుని వాక్యాన్ని ధ్యానించటం లోను జ్ఞాపకము పెట్టుకొంటే నీ సమస్యలకు దేవుడు ఓ నిలుపుదలను కలిగిస్తాడు.

భయానికి లోబడటమంటే సాతానుకు వాని శక్తులకు మన హృదయములలోని దారి తెరవటమే. నిన్ను అంతా అవి ఆవరించుకుంటాయి. నీ మెదడు ఒక అయస్కాంతము వంటిది. నీ పరిస్థితులలో నీవేమి ఆలోచిస్తావో నీ మెదడుకు ఆలోచించటానికి నీవేమి ఇస్తావో అవన్ని నీ మెదడులోకి ప్రవేశిస్తాయి. చెడు ఆలోచనలు ఆలోచించటము నీ జీవితం లోకి దేవునికి ఇష్టంలేని విషయాలు నీలో ప్రవేశించటానికి మార్గము. ఇది ఆధ్యాత్మిక చట్టము. అయస్కాంతము ఎలక్ట్రానిక్ శక్తి వలన పనిచేస్తుంది. అదే విధంగా నీ ఆలోచనలు ఎలక్ట్రానిక్‌గా పనిచేస్తాయి. మనిషి దేని గురించి ఆలోచిస్తాడో దానిని చేస్తాడు. (సామెతలు 23:7) ఆవిధముగా నీ ఆలోచనలు నిన్ను అదేవిధముగా బయటకు తెస్తాయి. దేవునియందలి విశ్వాసంతో విశ్వాసమును గురించి ఆలోచించు పరిశుద్ధ దూతలు నీలో పని చెయ్యటానికి అనుమతిని ఇవ్వు భయపెట్టే ఆలోచనలు ఆలోచిస్తే దుష్టాత్మలైనవి నిన్ను నాశనము చేయ ప్రవేశిస్తాయి. ఇక నీ ఇష్టము ఎందుకంటే నీ జీవిత నావకు నీవే నాయకుడవు. ఎట్లగయితే నేమి నీ ఆలోచనలే నిన్ను నడిపిస్తాయి. అవి మంచివి అయితే మంచి మార్గములోనికి చెడువి అయితే చెడు మార్గములోనికి నడిపిస్తాయి.

### స్థంభన నుండి రూపాంతరము

భయపడకుండ ఉండటానికి నీవు నిలుపు చేయబడగల పని నీకు తెలుసా? ఇశ్రాయేలీయులు జనసముదాయముగా అడవిలో ఉన్నప్పుడు అద్భుత కార్యములు చూచి కూడా భయములో భయాందోళనలో ఉండటము నేర్చుకున్నారు. విశ్వాసము నేర్చుకోలేదు. ఇరవై అద్భుత ఆశ్చర్యకార్యములు చూచిన జనాంగము విశ్వాసములో అనుభవము పొందారని అనుకొంటారా? కాని అలా జరుగలేదు. వారు భయపడ టానికే లొంగిపోయారు. కాని విశ్వాసానికి తావీయలేదు. ఐగుప్తులో వారు భయపడటానికి శిక్షణ పొందియున్నారు. వారి జీవనోపాధి గొప్ప హింసల మధ్య సాగింది. వారి హృదయాలు భయాందోళనలతో నిండి ఉండుట వలన వారు ఎప్పుడూ భయపడ్తూ ఉన్నారు.

హృదయములో నిండియుండు దానిని బట్టి ఒకని నోరు మాట్లాడును అని యేసుప్రభువు చెప్పారు. (లూకా 6:45)

నీవు దేనిలోనైనా ప్రత్యేక శిక్షణ పొంది యుంటే అదేవిధముగా మరియొక దానిలో కూడా తర్ఫీదు పొంద గలవని గ్రహించు. ఈ పాఠము యొక్క సారాంశము అందు కొరకే.

మనము విశ్వాస ఆత్మను సంపాదించుకొనవలెనన్న తాత్పర్యము కలిగియున్నాము కాని భయము విషయము కాదు. ఒక సమస్య ఉత్పన్నమైనపుడు పరిస్థితులను సరిగా ఆకలింపు చేసుకోకుండా భయపడకుండా ఏడ్వకుండా దేవుని వాక్యమును ధ్యానిస్తూ ఆయన మన పక్షమున ఉన్నారని నమ్ముచూ జీవించటానికి మనం అలవాటు చేసుకోవాలి. ఎందుకంటే నిజంగానే ఆయన మన పక్షమున ఉన్నారు. నేను భయపడను కాని ఏదో ఒక అద్భుతము జరగవలసి ఉంటే అదే జరుగుతుందని నమ్ముతాను. కాని నేను భయపడను.

*"యెహోవా నా పక్షమున ఉన్నాడు. నేను భయపడను. నరులు నాకేమి చేయగలరు? యెహోవా నా పక్షము వహించి నాకు సహకారియై యున్నాడు. నా శత్రువులవిషయమైన నా కోరిక నెరవేరుట చూచెదను. మనుష్యులను నమ్ముకొనుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలు రాజులను నమ్ము కొనుట కంటె యెహోవాను ఆశ్రయించుట మేలు"* కీర్తనలు 118:6-9

నీ తరపున దేవుడు గొప్ప అద్భుతములు జరిగించు టకు నీవేమి విశ్వాస వీరుడవైయుండ నవసరము లేదు. నీవు చేయవలసినదల్లా దేవుని వాక్యము యధార్థమని నమ్మి దాని ప్రకారం నడుచుకోవటమే. దేవునితో నీ నడతలు నీవు పూర్తిగా సామర్థ్యము పొంది యుండకపోతే దేవుడు నీ బలహీనతను తీసుకొని నడిపిస్తాడు. నీకున్న జ్ఞానము దేవుని గూర్చిన తెలివితేటల వలన కాదు దేవుడు నీలో పనిచేస్తున్నది - ఇది విశ్వాసమై ఆత్మ - యేసుప్రభువు లేనప్పుడు అనగా పాతనిబంధన కాలములో ఆయన గూర్చిన అనుభవజ్ఞానము లేనప్పుడు పాతనిబంధనలోని వ్యక్తులు ఒకరి తర్వాత ఒకరిని గురించి క్రొత్తనిబంధనలోని హెబ్రీయులకు వ్రాసిన పత్రిక పదకొండవ అధ్యాయములో వారు విశ్వామైన ఆత్మను కలిగి ఉన్నారని వివరించి ఉన్నది. చాలామందికి దేవునితో ఎక్కువ సంబంధాలు ఉన్నట్లు కనిపించకపోయినా వారికి విశ్వాసమైన ఆత్మ కలిగి ఉండిరి. 1కొరింథి 12లో పౌలుగారు విశ్వాస మనునది నీ మీదికి వచ్చినపుడు నీవు నమ్మకుండా ఉండలేవు. నీవు భయానక వాతావరణంలో చిక్కుపడినపుడు లేక దానిని గెలిచి బయటపడటానికి దేవుడు మానవాతీత శక్తితో నీ తరపున పనిచేసి నీకు విడుదల ఇస్తాడు.

విశ్వాస ఆత్మను కలిగియుండి దాని అభివృద్ధి చేసుకొని నందుకు ముఖ్యమైన పద్ధతి ఏదనగా - నాకు విశ్వాస ఆత్మ ఉన్నది నన్ను ఎవరూ కదిలించలేరని పెద్దగా అరచి చెప్పు టయే నిన్ను నీవు భయపడకుండా ఉండే విధంగా తీర్మానించు కొనినపుడు భయమును అడ్డగించగలవు.

భయపడకూడదని నీవు నిశ్చయించుకొనినపుడు భయాన్ని పారద్రోలగలవు. ప్రభువు మన ఆలోచనలను క్రొత్తవిగా చేయ టానికి ఆయన వేచి ఉన్నాడు. వారిని నలభై సంవత్సరములు ప్రత్యేక పరచి మిగిలిన వారంతా అరణ్యములో రాలిపోయేంత వరకు వేచి తర్వాత వారిద్దరిని వాగ్దాన భూమిలోకి తీసుకొని వెళ్ళాడు. ఆ దేశములో ఉన్నతదేహులను చూడవద్దు కాని కాలేబు యెహోషువ చూసినట్లు బలమైన గొప్పవైన ద్రాక్షా గెలవైపు చూడండి. దేవుడు వాగ్దాగ భూమిలోనికి నడిపిస్తున్నా డని తెలుసుకొనిన ఇద్దరు విశ్వాసముతో మాట్లాడారు. ఆ ఉన్నత దేహులకు జీవముగల దేవుడు లేడు. వారి కొరకు పనిచేసే దేవుడు లేడు కనుక వారు మనకు ఆహారము అవుతారు అని అన్నారు.

నలభై సంవత్సరాలు అరణ్యములో నివశించినను వారి విశ్వాస ఆత్మ తగ్గిపోలేదు. వాగ్దాన భూమిలో ప్రవేశించిన తర్వాత ఇది నా పర్వతము నేను ఆ ఉన్నతదేహుల వద్దనుండి దీనిని తీసుకొనగలను అన్నాడు కాలేబు. దేవుడు ఈ భూమిని వారి కిచ్చాడని చెప్పిన మాటను బట్టి అతను తన దృష్టిని దేవుని మీద నుండి మళ్ళించనందున అతను విశ్వాసాన్ని కాపాడుకున్నారు. అందువలన కాలేబుకు ఓ మంచి భూమి యెరూషలేమునకు ప్రక్కనే లభించినది. మన దేవుని మాట లను దేవుని సన్నిధిని విశ్వసించినపుడు ఆయన ఎప్పుడు మానవాతీత క్రియలు జరిపిస్తుంటారు.

**(ఇంకావుంది)**

స్త్రీల విభాగము



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

# ఎలీసబెతు

హేరోదు రాజు యూదా దేశాన్ని ఏలుతున్న దినాల్లో "అబీయా" తరగతిలో ఉన్న జెకర్యా అనే యాజకుడు ఒకడు ఉండేవాడు. అతని భార్య పేరు ఎలీసబెతు. ఈమె ఒక యాజకునికి భార్య మాత్రమే గాక యాజకుడైన అహరోను వంశములోని కుమార్తె. వీరు యూదా ప్రదేశములోని కొండసీమలో ఉన్న ఒక చిన్న గ్రామంలో నివసిస్తూ ఉండేవారు. వీరిద్దరు దేవుని సకల ఆజ్ఞలు న్యాయవిధులు నడుచుకుంటూనే వారిద్దరు వృద్ధాప్యంలోకి అడుగుపెట్టారు. అయినా వారికి పిల్లలు లేరు. ఎలీసబెతు గొడ్రాలుగా ఉండిపోయింది. వారు బహుకాలము గడిచిన వృద్ధులై దేవునియందు భయభక్తులతో ప్రార్థన చేస్తూనే ఉన్నారు.

జెకర్యా దేవాలయంలో యాజక ధర్మం జరిగిస్తూ ఉన్నపుడు ఆలయంలో ధూపము వేయడానికి అతనికి వంతు వచ్చింది. ధూప సమయంలో ప్రజలందరు వెలుపల ప్రార్థన చేస్తూ ఉంటే యాజకుడు ప్రజల విన్నపాలు దేవుని సన్నిధిలో విన్నవిస్తూ ధూపం వేయడం జరుగుతుంది. ఆ సమయంలో అకస్మాత్తుగా ధూపవేదిక కుడివైపున ప్రభువు దూత నిలిచి వుండడం జెకర్యా చూసి భయంతో కంగారు పడిపోయాడు. అప్పుడా దూత "జెకర్యా భయపడకు నీ ప్రార్థనలు దేవుని సన్నిధిలో వినబడ్డాయి. నీ భార్య అయిన ఎలీసబెతు నీకు కుమారుని కంటుంది" అని చెప్పాడు. జెకర్యా ఆశ్చర్యపడి పోయాడు. ఎందుకంటె దంపతులిద్దరు బహుకాలము గడచిన వృద్ధులు కదా! ఇది ఎలాగు సాధ్యమవుతుంది? అదే దూతను అడిగాడు కూడా! దేవుని సముఖంలో నిలిచే గబ్రియేలు దూత ఈ సువార్తమానం చెప్పడానికి వస్తే జెకర్యా నమ్మలేదు గనుక ఈ సంగతి జరిగే వరకు మాటలాడక మౌనివై ఉంటావని ప్రభువు దూత జెకర్యాతో చెప్పింది.

జెకర్యా ప్రభువు దూతతో మాటలాడుతూ ఉన్నందువలన బయటకు రావడం మామూలు కంటె ఆలస్యం అయింది. అందుకే ప్రజలందరూ ఆశ్చర్యపడుతూ ఎదురు చూస్తున్నారు. అతడు వెలుపలికి వచ్చాక వారితో మాటలాడ లేకపోయాడు. లోపల దేవదూత చెప్పింది కదా మాటలాడక మౌనివై ఉంటావని! అందుకే మూగవాడుగా మిగిలిపోయాడు. వారందరికి సంజ్ఞలు మాత్రం చేస్తున్నాడు. అప్పుడు ప్రజలు అతనికి దేవాలయములో దర్శనం కలిగిందని గ్రహించు కున్నారు. అతడు అలాగే దేవాలయము లో సేవచేస్తూ ఉన్నాడు. అతడు సేవచేయు దినాలు సంపూర్ణమైనపుడు సమీప గ్రాములలో ఉన్న వారి ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు.

జెకర్యా ఆ మూగ సైగలతోనే ఎలీసబెతుకి ఆలయములో తనకు కలిగిన దర్శనం గురించి చెప్పి ఉండవచ్చు. ఎలీసబెతుకి సరిగ అర్థం కాకపోయినా విషయం మాత్రం బాగానే గ్రహించుకుంది. ఆమె ఎంతో వృద్ధురాలై ఉన్నా దేవుని సన్నిధిలో దేవదూత చెప్పిన మాటలు ఎంతో విశ్వాసంతో నమ్మింది. దేవుడు ఆమెకు గర్భం దాల్చడానికి తగిన బలాన్ని శక్తిని అనుగ్రహించాడు. ఓర్పును, ఓపికను ఇచ్చాడు. కొన్ని దినాలయ్యాక ఆమె గర్భవతి అయింది. "మనుష్యులలో నాకుండిన అవమానాన్ని తీసివేయడానికి ప్రభువు నన్ను కటాక్షించాడని" నమ్మి దేవుని యెడల ఎంతో కృతజ్ఞురాలై ఐదు నెలలు ఎవరికంటా కనబడకుండ ఉండిపోయింది.

ఆ తరువాత గబ్రియేలను దేవదూత కన్యయైన మరియ దగ్గరకు వచ్చి యేసుప్రభువు జన్మమును గూర్చి తెలియ జేసినపుడు "నీ బంధువురాలు ఎలీసబెతు కూడా తన వృద్ధాప్యంలో ఒక కుమారుని గర్భం ధరించి ఉందనీ గొడ్రాలు అని పేరుబడిన ఆమెకు ఇపుడు ఆరవ మాసమని కూడా

చెప్పింది. అప్పుడు మరియ చాలా సంతోషంతో ఆ చిన్న గ్రామంలో ఉన్న జెకర్యా ఇంటికి వెళ్ళింది. ఎలీసబెతు చూడగానే ఆమెకు వందనం చేసింది. మరియ వందన వచనం వినగానే ఎలీసబెతు గర్భంలో ఉన్న శిశువు గంతులు వేశాడు. అప్పుడు ఎలీసబెతు పరిశుద్ధాత్మతో నిండుకొని సంతోషంతో గట్టిగా ఆమెతో మాట్లాడింది. ఎలీసబెతు కంటె మరియు చాలా చిన్నది. ఆమె బహుకాలము గడచిన వృద్ధురాలు. మరియ పెండ్లికాని కన్య! అయినా మరియను ప్రభువు తల్లిగా గౌరవించింది. ఆశీర్వదింపబడినదానవు, ధన్యురాలవు అంటూ ఆమెను పొగిడింది. ప్రభువు తల్లి ఆమె దగ్గరకు రావడం ఎంతో భాగ్యంగా ప్రాప్తించిందని ఆనందించింది. వృద్ధురాలైన తనను తాను తగ్గించుకొని మరియను పొగిడింది. మరియ వారి ఇంటిలో మూడు నెలలు ఉండిపోయింది.

ఎలీసబెతు మరియకు మూడు నెలలు ఆతిధ్యం ఇవ్వడం చాలా విచిత్రంగా ఉంది. అంతేకాక భర్త ఇప్పుడు మూగవాడై ఇంట్లో ఉన్నాడు. బయటి పనులూ ఇంట్లో పనులూ అన్ని తానే చక్కబెట్టుకోవలసి వస్తుంది. పైగా ఇంట్లో అతిధి! ఆమె కూడా గర్భవతి! ఇట్టి పరిస్థితుల్లో ఎలీసబెతు ఆమెకు మూడు నెలలు ఆతిధ్యం ఇవ్వడం ఆశ్చర్యం కదా! మరియను ప్రభువుతల్లిగా గౌరవించి, ప్రేమతో ఆతిధ్యం ఇవ్వడం ఎంతో ఆశ్చర్యమే! ఇద్దరూ కలిసి ఎన్ని సంగతులు మాట్లాడుకున్నారో ఎంత ప్రేమను ఒకరికొకరు పంచు కున్నారో! తమకు కలిగిన దర్శనాలను గూర్చి ఎంత సంతోషంగా చెప్పుకున్నారో! పుట్ట బోయే తమ కుమారులను గూర్చి దేవుడు వారి విషయమై చెప్పిన గొప్ప మాటలను గూర్చి ఎంత ఉప్పొంగిపోతూ చెప్పు కున్నారో! ఎలీసబెతు తనకు పుట్టబోయే కుమారుని కన్నా మరియ ఇంకా గొప్పవాడైన కుమారుని కనబోతున్నదని తెలిశాక కూడా ఆమెను ఏమాత్రం అసూయా ద్వేషాలు లేకుండ మరింత ప్రేమతో గౌరవంతో నిష్కల్మషమైన మనసుతో ఆదరించిన విధానం ప్రతి స్త్రీ గుర్తించవలసిన గొప్ప గుణం.

సాధారణంగా ఎవరైనా ఒకరికంటె తామే ఎక్కువగా ఉండాలనే కోరుకుంటారు. ఒకరికంటె ఒకరు ఎక్కువగా ఉంటే తప్పక అసూయా ద్వేషాలు రగిలిపోతాయి. వారి నెలాగైనా తమకంటె తక్కువ చేయడానికి కూడా ప్రయత్నించే వారు లేకపోలేదు. ఇక ప్రేమాభిమానాలు చూపించే దెక్కడుంది? అలాంటి గొప్ప ప్రేమాభిమానాలు ఎలీసబెతు దగ్గర మూడు నెలలు పొంది తన ఇంటికి తిరిగి వెళ్ళింది మరియ!

ప్రసవ కాలం వచ్చినపుడు ఎలీసబెతు దేవదూత చెప్పినట్లు కుమారునికి జన్మనిచ్చింది. అప్పుడు ఇరుగు పొరుగువారు, బంధువులు ఈ విషయం విని ప్రభువు ఆమె మీద మహా కనికరముంచిన విధానం చూచి ఎంతో సంతోషించారు. ధర్మశాస్త్ర ప్రకారం ఆ శిశువుకు ఎనిమిదవ దినాన సున్నతి చేసినపుడు తండ్రి పేరును బట్టి అతనికి జకర్యా అని పేరు పెట్టబోయారు. కాని ఎలీసబెతు అలా కాదు అతనికి "యోహాను" అని పేరు పెట్టాలని చెప్పింది. మీ బంధువులలో ఎవరూ లేరు కదా అని జెకర్యాకు సంజ్ఞలు చేసి అడిగారు. అతడు పలకమీద అదే పేరు వ్రాశాడు. అప్పుడందరు ఆశ్చర్యపడ్డారు. అప్పుడే జెకర్యా నాలుక సడలి నోరు తెరువబడి దేవుని స్తుతించుచు మాట్లాడడం మొదలు పెట్టాడు.


'యోహాను' ఎలీసబెతు గర్భంలో దేవుని చిత్త ప్రకారంగా ఉన్నా తల్లియొక్క మంచిగుణాలు గర్భము లోనుండే అతనికి అలవడినాయి. ఆమె ప్రార్ధనా జీవితమూ, దైవభక్తి, విశ్వాసమూ, వినయ విధేయతలూ, ప్రేమాభిమానాలు అన్నీ పుట్టుకతోనే ఉండి లోకంలో గొప్ప సేవచేశాడు.

పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము పొందాలని యొర్దాను నది ప్రదేశమంతట ప్రకటించి అనేకులకు బాప్తిస్మము ఇచ్చాడు. యేసుప్రభువు గూర్చి చెప్తూ నా వెనుక వచ్చువాడు నాకంటె ప్రముఖుడు ఆయన చెప్పులు విప్పుటకైనా పాత్రుడను కానని తనను ఎంతో తగ్గించుకున్నాడు.

స్త్రీలు కనినవారిలో యోహాను కంటె గొప్పవాడెవ డును లేడు. (లూకా 7:28) అని యేసుప్రభువు యోహాను గూర్చి చెప్పాడు. ఇట్టి గొప్ప వ్యక్తిని కనిన స్త్రీ ఎలీసబెతు! అంతటి గొప్ప వ్యక్తిగా తయారుచేయడానికి దేవుడు ఎలీసబెతు వంటి మంచిగుణాలు కలిగిన స్త్రీని ఎన్నుకున్నాడు. అలాంటి మంచి గుణాలు అలవర్చుకొని దేవుని కొరకు గొప్పకార్యాలు చేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనలను సిద్ధపరచునుగాక!

17

# ఏడు సంఘాలు



బ్రదర్ కె.సామ్రాట్

## లవొదికయ సంఘము

**(నులివెచ్చని సంఘము. ప్రకటన 3:14-22)**

ఆకాశమహాకాశములకు అతీతమైనది. 'ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము' అంటాడు ప్రభువు (యెషయా 66:1). ఈ సింహాసనపు ఛాయలలో బ్రతికే వాడు ధన్యుడు. క్రీస్తు సిలువ సింహాసనాన్ని జయించాలి. విమోచన సింహాసనాన్ని విశ్వాసులకు సంపాదించి పెట్టాడు. హెబ్రీ గ్రంథకర్త ఈ సింహాసనాన్ని కృపాసనము అని పిలిచాడు. ప్రియసోదరుడా! నీవు బబులోను అనే ఈ లోకాన్ని జయిస్తే తప్పక నీవు ఆయన సింహాసనం మీద కూర్చుంటావు. ఇది ప్రభువు యిచ్చే వాగ్దానం. సింహాసనం అధికారమునకు సూచన. ప్రభుత్వానికి అది గుండెకాయ. ఈ అత్యున్నతమైన సింహాసనం మీద ప్రభువు ఆసీనుడై యుండటం, సెరాపులు గడప కమ్ముల పునాదులు కదిలేటట్లుగా స్తుతులు చెల్లించడం యెషయా దర్శనంలో (6వ అధ్యా.) చూచాడు. పెంటకుప్పల మీద పడియున్న మనము ఆయన సింహాసనం మీద కూర్చోవటం మహద్భాగ్యం కాదా! ఘనతలలో గొప్ప ఘనత ఏది? సింహాసనముపై కూర్చోవటమే గదా. దేవుడు తన పరిశుద్ధ సింహాసనము మీద ఆసీనుడై యున్నాడు" (కీర్తనలు 47:8). ఆ ఇరువది నలుగురు పెద్దలు సింహాసనమందు ఆసీనుడై యున్నవాని యెదుట సాగిలపడి తమ తమ కిరీటాన్ని (4:10) తీసివేశారు. ప్రకటన గ్రంథమంతా సింహాసనాల మయం. అడుగడుగునా సింహాసనం కనిపిస్తొది. యెహోవా భక్తుడు పొందిన మహాదర్శనంలో "పరలోకమందును భూలోకమందును భూమి క్రిందను సముద్రములోను ఉన్న ప్రతి సృష్టము, అనగా వాటిలోనున్న సర్వమును సింహాసనా సీనుడైయున్న వానికిని గొఱ్ఱెపిల్లకును స్తోత్రమును, ఘనతయు మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగును గాకని చెప్పుట వింటిని. ఆ నాలుగు జీవులు ఆమేన్ అని చెప్పగా ఆ పెద్దలు సాగిలపడి నమస్కారము చేసిరి (5:3-14). కావున మనం స్వపరీక్ష చేసుకొని సులువుగా చిక్కులు పెట్టే సమస్యల నుంచి బయటపడి ఆయనతో సింహాసనం మీద కూర్చుంటాం (ఎఫెసీ.2:7), మహిమలో పాలు పొందుతాం. ఆయనతో కలిసి లోకానికి తీర్పు తీర్చగలం (1కొరింథీ.6:2).

చివరగా ప్రకటన గ్రంథం 20వ అధ్యాయంలో న్యాయ సభా సింహాసనం చూస్తాం. దీన్నే ధవళ సింహాసనం అంటాం. దీనికో ప్రత్యేకత ఉంది. పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందకుంటే ఈ సింహాసనం ముందు నిలబడాల్సిందే. ధవళ సింహాసనం ముందు నిలబడడం మరణశిక్షకే. ఇక్కడ న్యాయం భీకరరూపం దాలుస్తుంది. పాపాంధకారపు బాటలో పయనిస్తూ సిలువను గూర్చిన వార్తను తిరస్కరించిన వారికిది విమర్శస్థలం. నులివెచ్చగా వున్న లవొదికయ వారు కూడా తప్పించుకోలేరు. నేడే దీన్నుంచి తప్పించుకోడానికి సింహాసనాసీనుడై యున్నవాని ఎదుట మోకరించి, ప్రార్థించు. ఆయన పరిపాలనా సింహాసనాన్ని ఆశ్రయించే వాడు ధన్యుడు.

### ముగింపు మాటలు

లవొదికయ సంఘంతో ప్రభువు 'నీ క్రియలు నేనెరుగు దును, నీవు చల్లగానైనను వెచ్చగానైనను లేవు, నీవు చల్లగా నైనను వెచ్చగానైనను వుండిన మేలు, నులివెచ్చగా వున్నావు

గనుక నేను నిన్ను నా నోట నుండి ఉమ్మివేయనుద్దేశించు చున్నాన'ని కఠినంగా హెచ్చరించాడు. గనుక అరకొర మనస్సుతో నులివెచ్చని సంబంధం కలిగియుండటం దేవుని కిష్టము లేదని గ్రహించాలి. అటు ఇటు కాని పరిస్థితి అన్ని విధాల నష్టం. వెచ్చగా ఉండాలి. దినదినము పరిశుద్ధాత్ముని పరిచర్యలో ప్రభువు స్వారూప్యంలోకి ఎదగాలి. సువార్త సేవలో శ్రద్ధాశక్తులతో పాల్గొని ఇతర లావాదేవీల్లో క్రైస్తవ సాక్ష్యం పోగొట్టుకొని తమ వ్యవహార దక్షతను చూపిస్తూ దురాశను, వంచనను లౌక్యంగా ప్రదర్శిస్తున్న లవొదికయవంటి వారలారా! నులివెచ్చదనాన్ని వీడి రండి. దేవునిచేత ఉమ్మి వేయించుకోవద్దు. ఆచారాలు ఆరాధనలు పనికిరావు. సరైన వెచ్చదనం కావాలి. దేవుని చిత్తం వేడివేడిగా నెరవేర్చుటకై ఆయనకు సంపూర్ణ విధేయత చూపించాలి. స్వంత ఇష్టానుసారంగా జీవించటం కుదరదు.

నేను ధనవంతురాలిని, ధనవంతుడను. ఎంతో ధనవృద్ధి చేసుకొనియున్నాను. నాకేమి కొదువలేదని చెప్పుకొంటున్న వారలారా, లోకంలో ఘనత వుంది గాని, ప్రభువు దృష్టిలో బహు నీచస్థానంలో ఉన్నావని గుర్తించు. ఫలము ఫలించిన కొలది, ద్రవ్యము అధికమైన కొలది, పేరు ప్రతిష్ఠలు పెరిగే కొలది తృణీకారం, నిర్లక్ష్యం, దుర్వ్యసనాలు, దౌర్జన్యం ప్రబలిపోతున్నాయి. ఇది నీకు మంచిది కాదు. సంఘమా నీ వస్త్రాలు తెల్లగా లేవు. పుటము వేయబడిన బంగారమనే వాక్యం అసలే లేదు. దిసమొల అసహ్యం కప్పివేయడానికి నీతి వస్త్రాలు ఆయన వద్ద కొనుక్కో. కనుదృష్టికై ఆయనిచ్చే కాటుక కొనాలి. యింకా తరుణ ముంది. ప్రభువు సంఘంలో లేకుండా ఏమి చేస్తే మాత్రం ఏముంది? లవొదికయ ఆయన్ని వెలుపట ఉంచి లోన గడియ పెట్టుకుంది. పాఠకా, నీ పరిస్థితి యిదేనా? ప్రభువు తలుపునొద్ద నిలుచుండి తడుతున్నాడు. ఎవరు వ్యక్తిగతంగా హృదయమనే తలుపును తెరుస్తారో, ఆయన్ని చేర్చుకోడానికి యిష్టపడతారో, అట్టివారితో ఆయన సహవాసం చేయ గోరుతున్నాడు. హృదయపూర్వకంగా ఆయన్ని రమ్మని ఆహ్వానిస్తావా?

లోకంతో కలిసి పోకుండా, లోకాశల్ని నిర్మూలం చేసి లోకమర్యాదను అనుసరించకుంటే సింహాసనమెక్కి రాజ్య పరిపాలన చేస్తారు. దేవుని (అధికారం) సింహాసనం, సహవాసం వారికి దక్కుతుంది. ప్రతి సంఘంతో చెవిగల వారు వినును గాక అని ముగించబడింది. శ్రమలు రాకముందే నీ చెవులు సరిగా పనిచెయ్యనియ్యి. ఆత్మ చెబుతున్నది చెవిగలవారు వినాలి. వింటే విశ్వాసం కలుగుతుంది. ప్రియసోదరుడా! ఈ ఏడు సంఘాల్లో ఉన్న ఏ పరిస్థితి నీలో వుంది? దాన్ని సరిచేసుకునే అవకాశం వుంది. ఇంతటితో సంఘాల చరిత్ర ముగిసింది. మన జీవితాలు ముగియక ముందే దిద్దుకుని విధేయత చూపుదాం. దేవుని కృప మనందరికి తోడైయుండును గాక! ఆమెన్.

**(సమాప్తం)**





**పాఠకులకు, చందాదారులకు,**

**ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

**క్రిస్మస్ మరియు**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**

**- ఎడిటర్ మరియు సిబ్బంది**

# క్రిస్మస్ - మహా పండుగ

చాలామంది క్రిస్మస్‌ను కేవలం పండుగగా భావిస్తారు. క్రిస్మస్ పండుగ మాత్రమే కాదు మహాపండుగ. ఎందుకు ఇది మహాపండుగ అంటే? మహాదేవుడైన యేసుక్రీస్తు ప్రభువు ఆవిర్భవించిన శుభదినం గనుక. యేసుక్రీస్తు కేవలం దేవుడు మాత్రమే కాదు ఆయన మహాదేవుడు. "మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు" అని బైబిల్ గ్రంథం సెలవిస్తుంది. (తీతు 2:13) ఆ మహాదేవుని జననదినం మహాపండుగ కాకపోతే మరేమవుతోంది? ఇది ఎందుకు మహాపండుగగా పరిగణించబడిందో మరో ముఖ్యమైన విషయం కూడా మనం ప్రస్తావించుకోవాలి. ప్రపంచ జనాభాలో క్రిస్టియన్లు అధిక సంఖ్యాకులు. ఈ అధిక సంఖ్యాకులైన క్రైస్తవులు భక్తి భావాలతో జరిగించుకొనే అతిపెద్ద పండుగ క్రిస్మస్ పండుగ. భారతదేశములో పెద్దపండుగ ఏదో మనకు తెలుసు. క్రిస్మస్ భారతదేశంలో మాత్రమే కాకా యావత్ ప్రపంచంలోనే అతిపెద్ద పండుగ. పైకారణాలనుబట్టి క్రీస్తు జయంతి అనబడు క్రిస్మస్ పండుగ కేవలం పండుగ మాత్రమే కాదు మహాపండుగ అని మనం గ్రహించాలి. అబ్రహాం లింకన్ జన్మ దినోత్సవాన్ని అమెరికా దేశస్తులు మాత్రమే జరిగించుకొంటారు. మహాత్మాగంధి జన్మదినోత్సవాన్ని భారతీయులు మాత్రమే జరిగించుకుంటారు. కాని క్రీస్తు జయంతి ఒక్క దేశానికో ఒక్క ప్రాంతానికో సంబంధించినది కాక, యావత్ ప్రపంచానికి సంబంధించిన పండుగ క్రిస్మస్ పండుగ. మానవుడు చంద్రమండలముపై అడుగుపెట్టడం కంటే దేవాదిదేవుడు సృష్టికర్త భూమండలంపై అడుగుపెట్టడం గొప్ప విశేషం.

### క్రిస్మస్ ఆనందంకాదు - మహానందం

"వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి సాగిలపడి, ఆయనను పూజించి తమ పెట్టెలువిప్పి బంగారమును, సాంబ్రాణిని, బోళమును, కానుకలుగా ఆయనకు సమర్పించిరి." (మత్తయి 2:10-11) తూర్పు దేశపు జ్ఞానులు యేసు బాలుని చూచి అత్యానందభరితులయ్యారు. ఆనందమును మించింది అత్యానందం ఆసక్తిని మించింది అత్యాసక్తి. తూర్పుదేశపు జ్ఞానులు యేసును చూచిన తరువాత వారి ఆనందానికి అవధులు లేవు.

సంతోషం ఆనందం జంట పదాలు. ఇవి రెండు ఒక్కటికాదు. వీటికి వేరువేరు భావాలు న్నాయి. సంతోషం మన జీవితాలలో జరిగే సంబరాల మీద ఆధారపడి ఉంటుంది. సంతోషం కొంత కాలం ఉంటుంది. కాని ఆనందం పరలోక సంబంధమైనది. ఇది మానవహృదయంలో శాశ్వత కాలం ఉంటుంది. ఆనందం వ్యక్తిగతమైనది. సంతోషం పదిమందితో కలసి జరిగించు కొనేది. యేసు జన్మనుబట్టి అందరం కలిసి సంతోషిస్తాం. యేసు నా కొరకు జన్మించాడని నా హృదయంలో నేను ఆనందిస్తాను. ఆనందం వైయక్తికం.

క్రిస్మస్ దినాన రాత్రి వార్తలు చూడండి. క్రిస్మస్‌ను క్రైస్తవులు కడు వైభవంగా జరిగించుకొన్నారు. అని చెపుతూ క్లబ్బుల్లో త్రాగి నాట్యం చేసే యువతి యువకులను చూపిస్తారు. వాస్తవానికి ఇది క్రిస్మస్ సంతోషము కాదు. ఆనందం అంతకంటే కాదు. ఇలా చేయడం ద్వారా యేసు బాలుణ్ణి పురిట్లోనే హత్య చేసిన వారమవుతాం. క్రిస్మస్ అంటే మితిమీరి తినటంకాదు, మితిమీరి త్రాగటం అంతకంటే కాదు. మత్తయి సువార్త 3వ అధ్యాయములో జ్ఞానులు అత్యానంద భరితులు కావడానికి కారణం: 1. వారి అన్వేషణ. 2. వారి ఆరాధన. 3. వారి అర్పణ. ప్రియ విశ్వాసీ! క్రీస్తు జన్మనుబట్టి నీవును అత్యానంద భరితుడవు కావాలని దేవుడు ఆశపడుతున్నాడు.

### క్రిస్మస్ సంతోషముకాదు - మహాసంతోషము

"ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను." (లూకా 2:10) అని స్వర్గలోక దూతలు భూమిపై గానం చేశారు. ఇది ఒక్కరిగానం కాదు. ఇద్దరి గానంకాదు. గొప్ప సైన్యసమూహ గానం. పరలోకం నుండి భూమిమీదకు వచ్చి గానం చేశారు. వీరాలపించిన మధురగానంలో "ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువర్త మానము" అని పాడారు. అంటే క్రిస్మస్ కేవలం సంతోషం కాదని, అది మహాసంతోషమని మనకు విదితమవుతోంది. సంతోషం అనునది ఒంటరిగా జరిగించుకొనేది కాదు. ఇది కేవలం మనిషి అంతరంగానికి పరిమితం కాదు. ఇది అందరు కలిసి సామూహికంగా జరిగించుకొనేది. ఒక వ్యక్తి ఏకాంతముగా

సంతోషించలేదు. ఇద్దరుకలిసి సంతోషించగలరు. యేసుక్రీస్తు జననంతో అటు పరలోకం ఇటు భూలోకం సంతోషభరిత మయింది. మనుషులు పోగొట్టుకొనిన ఈ సంతోషం యేసుక్రీస్తు రాకతో తిరిగి పొందగలిగారు. యేసుక్రీస్తు అనేక పర్యాయములు ఈ సంతోషమును గూర్చి ప్రబోధించాడు. లూకా శుభవార్త 15 అధ్యాయంలో

1) తప్పిపోయిన గొర్రె దొరికినపుడు యజమాని ఇంటికి వచ్చి తన స్నేహితులను పొరుగువారిని పిలిచి మరీ సంతోషించాడు (లూకా 15:5). 2) పోగొట్టుకొనిన నాణెం దొరికినపుడు ఆ స్త్రీ తన చెలికత్తెలను పొరుగువారిని పిలిచి మీరు నాతో కలిసి సంతోషించుడి అని చెప్పింది (లూకా 15:9) 3) అలాగే తప్పిపోయిన కుమారుడు తిరిగి ఇంటికి వచ్చినపుడు తండ్రి అందిరతో కలిసి సంతోషించాడు గమనించండి. పై లేఖనాలనుబట్టి చూస్తే సంతోషం స్నేహితులతో ఇరుగుపొరుగు వారితో కలిసి ఉత్సాహంగా జరిగించు కొనేది. క్రిస్మస్ కూడ ఒంటరిగా జరిగించుకొనే పండుగకాదు. మన బంధువులతో స్నేహితులతో జరిగించుకొనే పవిత్ర పండుగ క్రిస్మస్. క్రిస్మస్ సంతోషం కాదు. మహాసంతోషం. ఈ మహాసంతోషం అనుమాట కొన్ని సందర్భాలలో మాత్రమే బైబిల్‌గ్రంథంలో వ్రాయబడింది.

1) రక్షకుని జన్మవార్త మహాసంతోషంతో కూడిన శుభవార్త 2) అన్యజనులు రక్షణ అంగీకరించినపుడు క్రైస్తవ సంఘమునకు మహాసంతోషం కలిగింది (అపో.కార్య. 15:3). 3) శుభవార్తచే పట్టణమును సువార్తికులు నింపినపుడు ఆ పట్టణం మిగుల సంతోషంతో నింపబడింది. (అపో.కార్య 8:8). 4) "ఆత్మఫలం"లో రెండవది సంతోషం. దేవుడు క్రిస్మస్‌ను మనకు మహాసంతోషంగా మార్చాడు. దేవునికి స్తోత్రము.

## క్రిస్మస్ వార్త కాదు - శుభవార్త

"ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము" (లూకా 2:10) ఈ వచనంలో సువర్తమానము అని వ్రాయబడి ఉంది. అంటే క్రిస్మస్‌ను గురించిన వార్త కేవలం వార్త కాదు అది శుభవార్త. వార్తకు - శుభవార్తకు ఎంతో వ్యత్యాసం ఉంది. వార్త భూసంబంధమైనది. వార్త అనుమాట NEWS అను ఆంగ్లపదం నుండి వచ్చింది. N అంటే NORTH, E అంటే EAST, W అంటే WEST, S అంటే SOUTH. భూమి నలువైపుల నుండి వచ్చింది వార్త. దీని ద్వారా వార్త భూసంబంధమైందని మనకు ఎవ్వరూ చెప్పకనే తెలుస్తుంది. హత్యలు, దోపిడీలు, ఆర్థిక విషయాలు, రాజకీయ విషయాలు, సాంఘీక విషయాలు, సాంస్కృతిక విషయాలు వీటన్నిటిని కలిపి వార్త అని అంటాము. వార్త భూసంబంధమైంది. వార్తను పాత్రికేయులు తెస్తారు.

శుభవార్త: వార్తకు భిన్నమైంది శుభవార్త. శుభవార్త పరలోకం నుండి వచ్చింది, వార్త భూలోకానికి చెందింది. వార్త మనుష్యులకు సంబంధించింది. శుభవార్త దేవునికి సంబంధించింది. శుభవార్త లేక సువార్త అంటే యేసుక్రీస్తు నా కొరకు వచ్చాడు. నా కొరకు చనిపోయాడు. నా కొరకు మృతి గెలిచి లేచాడు. రెండవ పర్యాయం తిరిగి రానై యున్నాడు. దీనినే మనం సువార్త అంటాము. ఈ శుభవార్త మహాసంతోషకరమైన శుభవార్త. దేవుడు ఈ సువార్తను తన దూతల ద్వారా మనకు పంపాడు. ఇది విమోచకుని గూర్చిన వార్త. తరతరాలుగా మానవులు ఎదురుచూస్తున్న జగద్రక్షకుని గూర్చిన వార్త. ఈ లోకంలో సువార్తను తృణీకరించువారు కొందరు, స్వీకరించువారు మరికొందరు, సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి అని అపొస్తలుడైన పౌలు వ్రాసాడు. (1 కొరింథీ. 1:18) ఆరంభ దినాలలో శుభవార్తను మోసికొని పోవుటకు దేవుడు గబ్రియేలును వాడుకొన్నాడు. దూతల సమూహమును వాడుకొన్నాడు. దూతలు యేసుక్రీస్తు మరణం వరకే పనిచేసినట్లు బైబిల్లో మనం చూస్తాం. యేసు పునరుత్థానుడై లేచిన తర్వాత గబ్రియేలు, మిఖాయేలులాంటి దూతలు మనకు కానరారు. యేసు పునరుత్థానుడైన వార్త తన శిష్యులకు అప్పగించాడు. ఇక దూతలతో పనిలేదు. మనమే ఆయన శుభవార్తను మోసికొనిపోయే దేవుని దూతలం. అందుకే సువార్తను మోసుకుని వెళ్ళేవారిని మనం సువార్తికులు అని అంటాము. సువార్తను ప్రకటించి ధన్యులైనవారు కొందరు. సువార్తను ప్రకటించక శపితులైన వారు మరికొందరు. సువార్త సువార్తికుని పోషిస్తుంది. కాని సువార్తను మనం పోషించం. శుభవార్తతో మన పల్లెలు, పట్టణాలు దేశాలు నింపబడాలని దేవుని అభీష్టం.

---

**Wish you a Happy Christmas and Blessed New year!!**



శ్రీమతి మాధురి మరియన్

# దేవుని ఇంటిలో అర్హమైన పాత్ర

క్రీస్తునందు మిక్కిలి ప్రియమైన సహోదరీ సహోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు. బాగున్నారా? ఇంతకాలం దేవుని మహాకృపలో మనలను క్షేమంగా ఉంచిన దేవునికి స్తోత్రములు.

“గొప్ప యింటిలో వెండి పాత్రలును, బంగారు పాత్ర లును మాత్రమే కాక, కఱ్ఱవియు, మంటివియు కూడా ఉండును. వాటిలో కొన్ని ఘనతకు, కొన్ని ఘనహీనతకు వినియోగింపబడును. ఎవడైనను వీటిలో చేరక తన్ను తాను పవిత్రపరచుకొనిన యెడల వాడు పరిశుద్ధపరచబడి, వాడు యజమానుడు వాడుకొనుటకు అర్హమైన ప్రతి సత్కార్యము నకు సిద్ధపరచబడి ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును” 2తిమోతి 2:20,21. మన ఇంటిలో వాడుకొనుటకు ఎన్నో పాత్రలు వుంటాయి. కొన్ని కొన్ని వాటి వాటి పని నిమిత్తము వాడుకుంటూ ఉంటాము. కొన్ని రోజూ వాడుకుంటాము, కొన్ని ఆయా సందర్భాలలో వాడుకుంటాము.

అలాగే దేవుడు మనలను కూడా ఆయా తలాంతులతో ఆయా సంధర్భములలో దేవుని ఇంటి పని కొరకు సృజించెను. కొన్ని ఘనతకు, కొన్ని ఘనహీనతకు వినియోగింపబడుచున్నవి. అయితే దేవుడు కోరుకుంటున్నది ఏమిటంటే ఘనహీనమైన వాటిలో మనము చేరక మనలను మనం పవిత్రపరచబడినవారమై పరిశుద్ధపరచి యజమానుడు వాడుకొనుటకు అర్హమైన పాత్రగా ఘనమైన పాత్రగా మనం ఉండాలని ప్రభువు కోరుచున్నాడు. మన పాత్రను ఎలా పరిశుద్ధముగా కాపాడుకుంటున్నాము? ప్రియమైన దేవుని బిడ్డలారా! దేవుని ఇంటిలో చాలా పని వుంది. మనం మన దైనందిన జీవితంలో మన సొంత కార్యాలకే ఎక్కువ సమయాన్ని గడుపుతూ ఉంటాము. దేవుని ఇంటి పని కొరకు ఎంత సమయాన్ని వెచ్చిస్తున్నాము?

లూకా 1:42లో ఎలీసబెతు మరియమ్మ గురించి పరిశుద్ధాత్మతో నిండుకొనినదై బిగ్గరగా పలికిన మాటలు ‘స్త్రీలలో నీవు ఆశీర్వదించబడినదానవు నీ గర్భఫలము ఆశీర్వదించబడును’. అలాగే మరియమ్మ పలికిన మాటలు “నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. ఆయన తన దాసురాలి దీనస్థితిని కటాక్షించును. నా ఆత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను. సర్వశక్తిమంతుడు నాకు గొప్ప కార్యమును చేసెను. గనుక ఇది మొదలుకొని అన్ని తరముల వారును నన్ను ధన్యురాలు అందురు”.

మరియమ్మ ఎలా తన పాత్రను పవిత్రముగా, పరిశుద్ధముగా కాపాడుకొన్నదో గమనించుదాం. తన యజమానుడు వాడుకొను పాత్రగా తన్ను తాను సిద్ధపరచుకున్నది. 2కొరింథీ. 4:7లో “అయినను ఆ బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు”. ఇదివరకటి కాలంలో చల్లటి నీరు కావాలంటే మట్టికుండను వాడేవారు ఇప్పటికీ వేసవికాలంలో మట్టి కుండను చల్లని మంచినీరు దాహం తీరేందుకు వాడుతుంటాము. గ్రామాలలో ప్రత్యేకమైన చేపల కూర వండాలంటే మట్టి పాత్రలే ఉపయోగిస్తారు. ఏ పాత్రయైన దానికి ఒక ప్రత్యేకత తప్పకుండా వుంటుంది. నీవు ఏ పాత్రగా ఉపయోగపడుతున్నా నీవు వున్న స్థితిలోనే దేవునికి కృతజ్ఞతలు చెల్లించు.

కీర్తనలు 51:10లో దావీదు మహారాజు అంటున్నాడు. “దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము. నా

అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము". మన ప్రార్ధనలో శక్తి వుండాలి. శుద్ధమైన మనసుతో సేవలో అభివృద్ధి పొందాలి. 1కొరింథీ. 12:4లో దేవుడు మనకు నానారకాల కృపావరములు నానా విధములుగా అనుగ్రహించాడు కాని ఆత్మ ఒక్కటే.

సౌలు పౌలుగా మారి యజమానుడు వాడుకొను అర్హమైన పాత్రగా మారిపోయాడు. పేతురు దుడుకు వాడుగా వున్నాడు కాని పేతురు మీద ఆయన సంఘాన్ని కట్టాడు. ఒకని తలాంతులను చూచి నిన్ను నీవు పోల్చు కోవద్దు. నీవు ఏ పని చక్కగా చేయగలవో ఆయనకు తెలుసు. ఆ పని కొరకు నిన్ను నీవు పరిశుద్ధపరచుకొని నీ యజమానుడైన దేవుడు అత్యంతంగా ఇష్టపడే పాత్రగా నీవు మారాలి. ఒకనికి దేవుడు ఐదు తలాంతులను ఇచ్చాడు. వాడు మరి పది తలాంతులను చేశాడు. రెండు తలాంతులు ఇచ్చిన వాడు ఐదు చేయగలిగాడు. ఒకటి పొందిన వాడు భూమిలో దాచిపెట్టి యజమానుడు ఇచ్చిన తలాంతును వాడుకొనలేదు. ఎవరు నిన్ను పిలిచి ఆ పని చెయ్యి, ఈ పని చెయ్యి అని చెప్పరు. దేవుని ఇంటిలో ఏ పని వుందా, నేను చేయగలిగినది అని నీవే ఆశతో, ఆసక్తితో, సంతోషంగా చేయాలి. నీ యజమానుడైన దేవుడు నిన్ను చూచి ఆనందించాలి.

ప్రియమైన దేవుని వారలారా, ఈ సంవత్సరములో ఎనిమిది దేశాలలో ఆయన నాకిచ్చిన స్తుతి పరిచర్యలో ఆయనను స్తుతించే పాత్రగా, సువార్తను అందించి నేను నా భర్త వాడబడ్డాము. ఆయనను స్తుతులతో ఘనపరిచాము. నా యజమానుడైన దేవుని ఇంటిలో స్తుతి పాత్రగా నన్ను వాడుకున్నందులకు ఆయనకే స్తుతి ఘనతా మహిమ యుగయుగములకు కలుగును గాక! దేవుని ఇంటిలో అర్హమైన యోగ్యమైన ఘనమైన పాత్రలుగా వాడబడదాము. ఆయన రాజ్యమును స్థాపించుదాము. ప్రభువు మిమ్మును ఆశీర్వదించును గాక! ఆమేన్.

## పాఠకుల పేజి

'పరిశుద్ధత' పత్రికలో **'పాఠకుల పేజీ'** అనే శీర్షిక ప్రారంభించుచున్నాము. ఈ పేజీ పూర్తిగా పాఠకులకు కేటాయించబడినది. ఈ పేజీలో మీ కుటుంబ సభ్యుల యొక్క పుట్టినరోజు, పెళ్ళిరోజు వేడుకలకు సంబంధించి వారికి పత్రికా ముఖంగా శుభాకాంక్షలు తెలియజేయవచ్చును. మీ కుటుంబంలోని యువతీ యువకుల వివాహ సంబంధ సమాచారం అలాగే సువార్త సభల సమాచారం, పదవీ విరమణ సమాచారం, జ్ఞాపకార్ధ కూడికల సమాచారం కూడా పంపవచ్చు. పత్రిక గురించి మీరు వ్రాసే ఉత్తరాలు కూడా ఈ శీర్షికలో ప్రచురించబడతాయి. అయితే ఈ అవకాశం ఉపయోగించదలుచుకునే వారు చందాదారులై ఉండాలి. పత్రికకు కట్టిన చందా మొత్తాన్నిబట్టి వారికి స్థలం కేటాయించబడుతుంది. సంవత్సర చందాదారులకి పేజీలో 1/4, రూ. 500 కట్టిన వారికి 1/2 పేజీ, రూ. 1000 కట్టిన వారికి ఫుల్ పేజీ కేటాయించబడును. రూ. 2000 కట్టిన వారికి టైటిల్ (కలర్) లోపలి పేజీలో 1/2 పేజి. రూ. 5000 కట్టిన వారికి టైటిల్ లోపలి ఫుల్ పేజీ కేటాయించబడును. ఈ అవకాశం సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ఉచితంగా ఇవ్వబడు తుంది. ప్రతినెలా 5వ తేదీ తర్వాత తేదీలలోని సంధర్భాలను మాత్రమే పంపించాలి. ఫోటో ప్రచురించాలంటే మీ ఫోటోని **Whatsapp** ద్వారా 9440217726కి లేదా ఈ-మెయిల్ ద్వారా holiness.ierf@gmail.comకి పంపాలి.

### మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్‌సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.

సాక్ష్యము

2

# ఆచార్య ఆరార్కేమూర్తి

1955వ సంవత్సరం ఆ రాత్రి నా జీవితంలో మరుపు రానిది. అంతరాంతరాలలో చెప్పశక్యంకాని వ్యథ మొదల య్యింది. క్రీస్తుకోసం శిబిరం వెలుపలికి వెళ్ళి నింద భరించ డానికి నా ఆత్మ భయపడుతోంది. గజగజ వణికి పోయాను. నాలోని నవనాడులు కుంగిపోయాయి. పడకలో అటూ ఇటూ పొర్లాడాను. అర్ధరాత్రి భరించరాని శిరోవేదన మొద లయ్యింది. అలాగే కునుకు పట్టింది. అది స్వాప్నిక అవస్థ నాలోని మనిషితో నేనే తర్కానికి ఉపక్రమించాను.

నాలో నేను, "నువ్వు యేసుకు విద్యార్థివి, శిష్యుడివి కాదు." "ఎందుకు కాను? జ్ఞాన సముపార్జన చాలదా?" "చాలదు, శిష్యుడు గురువు కాడిని మోయాలి". "శిష్యుడు కావాలంటే అంత వెల చెల్లించాల్సిందేనా? అది నావల్ల కాదు". "వెల చెల్లించందే శ్రేష్ఠమైంది దొరకదు".

ఈ విధంగా నేను మనసులోని మనసుతో ఎంతో రభస పడ్డాను. ఎటూ పాలుపోవటం లేదు. క్రైస్తవ్యంలో ఆకర్షణీ యమైంది ఏదీ లేదు. కానీ జాగ్రత్తగా వెతికితే బైబిల్లో క్రీస్తు సాక్షాత్కరిస్తాడు. మతపు దిబ్బలో క్రీస్తును పూడ్చి పెట్టారు. అందుకే నాబోటి వారికి క్రీస్తును వెదకటం ప్రయాస అయిపోయింది. దీనికి బాధ్యులు క్రైస్తవ మతస్థులే అని నేను ఘంటాపథంగా చెప్తున్నాను.

మనుష్యులకు మతం కాదు జీవమివ్వటానికి యేసు వచ్చాడు. నేటి అణుయుగంలో మతాలన్నీ మృత కళేబరాలు క్రీస్తు సజీవుడు, సమకాలీనుడు, మతాతీతుడు. మత ప్రమేయంలేని క్రీస్తే నాకు కావాలి. ఆయననే నేను ఆరాధి స్తాను. అదే ఉత్కంఠ తీవ్రంగా నాలో బయలుదేరింది. ఎలాగైతేనేం ప్రభువు కృపనుబట్టి చివరికి తీర్మానం చేసుకో గలిగాను. "ఏదీ ఏమైనా సరే యేసు నువ్వే నా రక్షకుడివి ప్రభువువు" అంటూ నిర్ధష్టంగా చెప్పేసి లేచాను. ఉలిక్కిపడ్డాను నా అనుభూతినంతా మళ్ళీ పునర్విమర్శన చేసి చూసు కున్నాను.

ఆ మరునాటి రాత్రి నా కంటి పొరలు రాలిపోయినట్టు దర్శనం కలిగింది. ప్రభువు సాక్షాత్కారం పొందాను. గలతి 2:20. నా హృదయ గుహలో మారుమోగింది. "నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడి ఉన్నాను. ఇకను జీవించే వాణ్ణి నేను కాదు. క్రీస్తే నాయందు జీవిస్తున్నాడు. ఇప్పుడు యీ శరీరంలో నేను జీవించే జీవితం నన్ను ప్రేమించి నా కోసమై తనను తాను అప్పగించుకున్న దేవుని కుమారుని యందలి విశ్వాసం వల్లనే జీవిస్తున్నాను". ఈ వచనం నాకు ఆశీర్వచనమైంది. ఇందులో చావు బతుకుల అంత రార్థం నాకు బయలుపడింది. నేను క్రీస్తునందు ఉన్నాను. ఆయనతో సంయుక్తమయ్యాను. అంచేత ఆయనతో సిలువ వెయ్యబడిన అనుభూతి నాకు ప్రాప్తించింది. పాపినైన నేను క్రీస్తుతో సంయుక్తం కావటానికి ఆయన్ను అంగీకరించటం కృప. ఇది నా పాప కర్మకు విముక్తి. నా స్వార్థానికి మరణం. నేను లేను, క్రీస్తు నన్ను ఆక్రమించుకున్నాడు. ఇది నా జీవితం కాదు, క్రీస్తు నాలో ఉండి జీవించే జీవితం క్రీస్తు నాలోనికి వచ్చాడు. పునరుత్థాన జీవితం ప్రసాదించాడు. నేను నేను కాను, నాలోని క్రీస్తు నా అనుభూతిలోకి అవత రించాడు. సిలువ వేయబడి తిరిగి జన్మించాను ఈ సత్యాన్ని నేను మననం చేసుకుంటున్నకొద్దీ నా మీద నాకే కాఠిన్యం కలిగింది.

నాకున్న స్వార్థం మీద అసహ్యం, విద్వేషం కలిగాయి. నాలో మంచిదేది కనిపించలేదు. క్రీస్తు నాలోకి వచ్చిన బిందువు వరకు నా గత జీవితమంతా ఎడతెగని ఒక పాపరేఖ. పాపపు పొడిగింపు నా వయస్సులో 30 సం॥ల జీవితం పాపమే. క్రీస్తు లేని నా జీవిత భాగమంతా పాపం. అప్పుడు సిలువ సందర్శనం చేసి సిలువ మీద క్రీస్తుకు చేతులు జోడించి ప్రప్రథమంగా నమస్కరించాను.

1955వ సంవత్సరం సెప్టెంబర్ 26న నా ఆధ్యాత్మిక జన్మదినం నేను నా తల్లి గర్భవాసాన పుట్టినప్పుడు పాపిని.

మొదటి పుట్టుకదినం చెప్పే తీర్పు ఇదే. అయితే ఈ రెండో జన్మదినం నా పాప విముక్తిని ప్రచురిస్తోంది. క్రీస్తే నా విమోచకుడు, ఇది విజయం. నాలోని సంఘర్షణ అంతరించింది. నాకు ఇప్పుడు అంతా కొత్తే. అదే రోజు హెన్రీక్రాన్ అనే సోదరుడికి టెలిగ్రాం ఇచ్చాను. ఆయన వచ్చాడు. "నేను క్రీస్తును నమ్ముకున్నాను. హృదయపూర్వకంగా ఆయనను విశ్వసిస్తున్నాను. దీనికి ఎలాంటి పరిణామం వచ్చినా వెనుదిరిగేది లేదు. నాకు బాప్తిస్మం ఇవ్వండి" అన్నాను.

"ఎందుకు నీకు బాప్తిస్మం?" అని అడిగాడు.

"క్రీస్తు నా ఆధ్యాత్మిక భర్త. ఆయన మాట వినాలి. నమ్మి బాప్తిస్మం పొందమన్నాడు. ఆయనతో నా ప్రయాణంలో ఇది మొదటి మజిలీ" అన్నాను. ఆ రోజు జోరున వర్షం కురుస్తుంది. లెక్క చెయ్యక అనుకున్న సమయానికి కొందరు బోధకులు వెంట రాగా నారాయణపేటలో ఓ పెద్ద బావివద్ద బాప్తిస్మం దీక్ష తీసుకున్నాను. నాలో ఆత్మ తీవ్రత కలిగింది. క్రీస్తును పూర్తిగా అనుభవించటం కోసం నా హృదయం తహతహ చెందింది. నేను ప్రభువుతో సంయుక్తతా స్థితి పొందాను.

విశ్వాసానికి నాలో సత్వర ఫలితం కలిగింది. ఆత్మ నన్ను క్రీస్తు శరీరంలోకి ప్రవేశపెట్టాడు. ఇది దివ్యానుభూతి. ఆయన వాగ్దానాలు నాలో నెరవేరుతున్నాయి. నూతన జన్మ పరిశుద్ధాత్మ నాలోకి రావటం, ముద్రించబడటం, పరిశుద్ధాత్మ బాప్తిస్మం ఇవన్నీ పరిశుద్ధాత్మ నింపుదలతో నన్ను ప్రేరేపించాయి.

నా భార్య వరలక్ష్మి విషయం ఇక్కడ క్లుప్తంగా చెపుతాను. ఆమె కూడా శ్రోత్రియ కుటుంబం నుండి వచ్చింది. నేను ప్రభువును విశ్వసించిన తరువాత నాలుగు సంవత్సరాలకు కాని ఆమె మనసు మారలేదు. ఎన్నో అభ్యంతరాలు ఆమెలో ముప్పిరిగొని ఉన్నాయి. విగ్రహారాధన సాంప్రదాయపు కటకటకాలలో నుండి వెలికి రావటం అంత సులభం కాదు. కాని దేవుని ఆత్మ ఆమెలో పాపాన్ని గురించి, తీర్పును గురించి, నీతిని గురించి ఒప్పుదల కలిగించాడు.

యోహాను 3:36 ద్వారా ఆమె రక్షణ పొందింది. నాకు వ్యతిరేకంగా ఉన్న తన వైఖరిని మార్చుకొని ప్రభువుకు విధేయత చూపి హైదరాబాదు నగరంలో బాప్తీస్మము తీసుకొని సేవలో నాకు సాటియైన సహాయం అయింది.

మేము ఎన్నో ప్రాంతాలు పర్యటించాము. మహబూబ్ నగర్‌లో ఉండి రేడియో సేవ ప్రారంభించాము నాతో పాటు సేవ చేసింది. ఎందరో హిందూ స్త్రీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి వారిని క్రీస్తు దగ్గరికి తెచ్చింది. క్రీస్తును బట్టి కలిగిన అనేక కష్టాలలో నాతో నిలిచి నాకు భాగస్వామిగా ఎంతో ఆదరణ, చేయూత ఇచ్చింది. ఆమె కోసం దేవునికి సర్వదా కృతజ్ఞుడిని.

దేవుడు మమ్ములను సేవలో విజయం నుంచి అత్యధిక విజయానికి తీసుకొని వెళుతు వచ్చాడు. పరిస్థితులను బట్టి దేవుని ఆజ్ఞ మేరకు మహబూబ్‌నగర్ నుండి కర్నూలుకు అక్కడ నుండి గుంటూరుకు తరలి వచ్చాము. 1969వ సంవత్సరంలో మహబూబ్ నగర్ కల్వరి సంఘంలో నేను సేవకై అభిషేకించబడ్డాను.

గుంటూరులో ఉండగా హిందూ సోదరుల మధ్య చేయడానికి గొప్ప దర్శనం ప్రభువు చూపించాడు. రోమా 9:3 పదేపదే నాకు జ్ఞాపకం రాసాగింది. దేహ సంబంధులైన నా సోదరుల కోసం నేనేం చెయ్యాలి? అనే ప్రశ్న ఎదురైంది. నా సమీప బంధువు లెందరో క్రీస్తును గురించి అపోహలతో సతమతమవుతున్నాను. నేను క్రీస్తును పైకెత్తుతాను. ఆయనే అనేకులను ఆకర్షించుకుంటాడు. అని సేవా దీక్షపూనాను. బ్రాహ్మణ్యం క్రీస్తుకు దూరంగా ఉండిపోవటం నాకు ఎముకలు విరిచినంత బాధ కలిగిస్తోంది. ఇంతటి ఆధ్యాత్మిక సంపత్తు క్రీస్తులో ఉంటే లేనిపోని అపోహలతో క్రీస్తును తిరస్కరించడం సబబుకాదు. **(సశేషం)**

**మీరు ఒక గొప్ప సాక్ష్యము కలిగి ఉండ వచ్చు. మీ సాక్ష్యము ద్వారా కొంతమంది మారవచ్చును లేదా విశ్వాసములో బలపడవచ్చు. అటువంటి గొప్ప సాక్ష్యములు మాకు పంపించండి. మేము వాటిని ప్రచురిస్తాము.**

# క్రిస్మస్ - వాస్తవగాథ

పిల్లలూ బాగున్నారా? క్రిస్మస్ పండుగ వచ్చేసింది. మరి అందరూ కొత్తబట్టలు కొనుక్కొని, పిండివంటలు చేసుకొని, గ్రీటింగ్‌కార్డ్స్ పంచుతూ బిజీబిజీగా ఉంటారు కదా! అయితే పేరుకే యేసు పుట్టినరోజు, ఈ బిజీలో యేసుప్రభువును జ్ఞాపకం కూడా చేసుకోరు. అవునో కాదో ఈ కథ చదివితే మీకే తెలుస్తుంది

ఐర్లాండు దేశంలోని ఒక పెద్ద పట్టణములో ఫుల్ ఫుల్టోన్ కృశ్చవ్ అనే ఒక గొప్ప ధనవంతుడు ఉండేవాడు. అతనికి అన్నీ సౌకర్యాలు ఉన్నాయి కానీ సంతానము లేదు. అందుకని ఆ భార్యాభర్తలు ఎప్పుడూ దుఃఖంతో జీవిస్తూ ఉండే వారు. సంతానము కొరకు వారు చేయని పూజలు, వ్రతాలు లేవు. ఎట్టకేలకు ఒక ఫాదరు వారి గృహాన్ని దర్శించి ప్రార్థనలు జరిపించి మీరు ఈ విధంగా జీవించినట్లయితే దేవుడు సంతోషించి మీ కోరిక తీరుస్తాడు అని చెప్పాడు. వారు ఆ విధంగానే ఎంతో భక్తిశ్రద్ధలతో ఆయన చెప్పిన విధంగా చేయటం వలన దేవుడు సంతోషించి వారికి చక్కని మగ సంతానాన్ని ప్రసాదించాడు. ఇక వారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. పిల్లవాడే వారి సర్వ స్వము. ఎప్పుడూ ఆ బాబుని గురించే వారి ధ్యాసంతా. అన్నీ ఆ బాబు కొరకే చేసేవారు. ఆ బాబు పేరట ఒక పెద్ద ఇల్లు, మంచి గుఱ్ఱపు బగ్గీ (అప్పుడు ధనవంతులు గుఱ్ఱపు బండ్ల మీదే ప్రయాణం), మంచి మంచి జాతి గుఱ్ఱాలు ఆ విధంగా ఎన్నో పిచ్చిపిచ్చిగా చేసేవారు.




బాబు మొదటి జన్మదినము వచ్చింది. ఆ వేడుక ఆడంబరంగా జరిపించాలని నిశ్చయించి ఎంతోమంది ధనవంతులైన తమ బంధువులను, వ్యాపారస్థులను, నగర పాలకులను ఆహ్వానించి గొప్ప విందు కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఇంటి నిండా పనివారే. ఆ రోజు చాలా హడావిడిగా వుంది. మంచి ఖరీదైన వంటకాలు చేయటంలో కొందరు, అతిథులను ఆహ్వానించడంలో కొందరు, ఇంటి అలంకరణలో కొందరు మునిగిపోయి వున్నారు.

సాయంత్రం 5 గంటలకే చీకటి పడిపోతుంది. అతిథులు ఒక్కొక్కరే రాసాగారు. అందరూ ఖరీదైన దుస్తులతో గొప్ప గొప్ప ఖరీదైన గుఱ్ఱాలని కలిగిన బగ్గీలలో రాసాగారు. అది మిక్కిలి మంచు కురిసే కాలము కాబట్టి అందరూ ఖరీదైన లాంగ్‌కోట్స్, తమ విలువైన వస్త్రాల మీద ధరించి వస్తున్నారు. లాంగ్ కోట్స్ చాలా బరువుగా కూడా ఉంటాయి. ఇవి తగిలించుకోడానికి ఒక గది, స్టాండ్సు ఉంటాయి. బాబు తల్లి బంధువులు చాలామంది రావటం వలన వారికి వసతులు చూడటానికని బాబు కొరకు ప్రత్యేకంగా నియమించిన ఆయాకి బాబుని అప్పగించి బంధువులను సంతోషపరచడంలో మునిగి పోయింది. తండ్రి గొప్ప గొప్ప అతిథులతో తమ గొప్పలు చెప్పుకుంటూ సమయం గడుపుతూ ఉన్నాడు. రాత్రి 10 గంటలకు డ్యాన్సు కార్యక్రమము, గొప్ప గొప్ప వారి విందులలో ఉండే ప్రత్యేకమైన త్రాగుడు కార్యక్రమం, చిందుల కార్యక్రమం మొదలయ్యింది. ఆడువారు మగ వారు కలసి నాట్యం చేయటం వారి సాంప్రదాయము. కృశ్చవ్, అతని భార్య అతిథులతో కలిసి నాట్యము చేస్తూ త్రాగుతూ సంతోషిస్తున్నారు. ఇక్కడ బాబు కొరకు నియమించబడిన

ఆయా 22 సంవత్సరాల యవ్వనస్తురాలు. (అక్కడ ఆయాలుగా యవ్వనస్తు లనే నియమిస్తారు). ఆమె ప్రియుడు ఆ సమయానికే అక్కడికి వచ్చి ఆమెని పిలిచాడు. బాబు నిద్రపోతున్నాడు. మరలా వెంటనే వచ్చేయొచ్చని బాబుని అక్కడే వున్న ఒక ఉయ్యాల లాంటి బాక్సులో చక్కగా పరుపు అమర్చి గోడ ప్రక్కగా పెట్టి వెళ్ళి పోయింది. అయితే సంగతేమిటంటే, ఆ ఉయ్యాలలాంటి బాక్సు ఉన్న పైగా ఈ లాంగ్‌కోట్స్ తగిలించుకునే స్టాండు ఉంది. ధనవంతుని ఇంట విందు కాబట్టి అతిధులు ఎక్కువగా వస్తున్నారు. అందరికీ లాంగ్‌కోట్స్ ఉన్నందున వారు వాటిని అక్కడే ఉన్న స్టాండుకి తగిలిస్తున్నారు.

అందులో ఒక కోటు జారి బాబు వున్న ఉయ్యాల మీద పడి బాబును కప్పి వేసింది. తరువాత వచ్చే వారు అది బాబు ఉన్న ఉయ్యాల అని గ్రహించక తగిలించుకోవడానికి స్థలము లేక ఒకరి తర్వాత ఒకరు ఆ బాబు ఉన్న ఉయ్యాల మీదనే వేసి చక్కా విందు, నాట్యాలకి వెళ్ళిపోయారు. అందరూ ఇలా ఉండగా 12 గంటలు అయ్యింది. బాబు పుట్టిన రోజు ప్రవేశించింది. కేక్ కట్ చేయాలి. అందరూ కలసి బాబుకి గ్రీటింగ్స్ చెప్పాలి. కనుక తల్లి వెంటనే ఆయా కొరకు వెదకింది. అయితే ఆయా బాబు సంగతి మరచి తన ప్రియుడితో హోటల్‌లో ఉండిపోయింది. ఇక్కడ అందరు ఆయా కోసం వెదుకుతున్నారు. తలా ఒక విధంగా మాట్లాడుతున్నారు. తల్లికి పట్టలేని దుఃఖము వచ్చేసింది. పెద్దగా ఏడ్వటం మొదలు పెట్టింది. ఇంటా బయటా అంతా వెదికారు. కానీ ఎక్కడా బాబు జాడకానీ, ఆయా జాడకానీ కనబడలేదు. కొందరు పోలీస్ రిపోర్టు ఇవ్వడానికి పరిగెత్తారు. కొందరు ఆయా ఇంటికి పరుగెత్తారు. అయినా జాడలేదు.

12 గంటల నుండి 3 గంటల వరకు దేవులాట కార్యక్రమము జరిగింది. ఇక తల్లిదండ్రుల గోడు చూడలేక వచ్చిన బంధువులంతా ఒక్కొక్కరే జారుకోవడం మొదలు పెట్టారు. పోయేటప్పుడు తమ తమ లాంగ్‌కోట్స్ తీసుకొని వెళ్తున్నారు. ఉన్నట్టుండి పెద్ద కేక "ఇదుగో బాబు" అని. అందరూ ఉలిక్కిపడ్డారు. ఎక్కడ ఎక్కడ అంటూ పరుగెత్తు కుంటూ వచ్చారు. తల్లి గభాలున బిడ్డని ఎత్తికొని ముద్దులు పెట్టటం మొదలు పెట్టింది. అయితే వెంటనే పెద్దగా అరిచింది. ఆ బాబు అచేతనంగా ఉన్నాడు. ఈ లాంగ్‌కోట్స్ అతని మీద పడటం వలన ఊపిరి ఆడక ఆ బాబు ఎప్పుడో చనిపోయాడు. ఇక తరువాత పరిస్థితి వ్రాసి మిమ్ములను దుఃఖ పెట్టడం నాకిష్టం లేదు. తల్లి దండ్రులు, బంధువులు గుండెలు అవిసేలాగున ఎంత రోదించారో మనం ఊహించ గలం. ఇది క్రిస్మస్ వేడుకకు మంచి నిదర్శనం. ఆ బిడ్డ జన్మదినమున బిడ్డను నిర్లక్ష్యం చేసి వారి విందు వినోదాలలో మునిగిపోయారు. బిడ్డకు ఆనందము కలిగించే పనులు తల్లిదండ్రులు బిడ్డను ఎత్తుకొని బంధువులకు, మిత్రులకు చూపించి దేవుడు తమను ప్రేమించి ఇచ్చిన బిడ్డ అని అందరికీ సాక్ష్యం చెప్పటం మరచి తమ సంతోషాలలో మునిగిపోయి బిడ్డను పోగొట్టుకున్నారు.

ఆలోచించండి. మనము చేసే ఈ క్రిస్మస్ పండుగ అలా ఉందేమో. క్రీస్తుకు ప్రాముఖ్యత ఇవ్వకుండా క్రీస్తుని సంతోషపరచకుండా క్రీస్తులేని క్రిస్మస్ పండుగను చేసి దేవుని దుఃఖ పెడుతున్నామేమో ఆలోచించండి. క్రీస్తుతో క్రిస్మస్ చేసి దీవెనలు పొందుదాము.

## -: పాఠకులకు గమనిక :-

**ఫేస్‌బుక్, ఆన్‌లైన్ తెలుగుబైబిల్ వెబ్‌సైట్, బైబిల్ క్విజ్ ద్వారా ఒక సంవత్సరం పాటు ఉచితంగా పత్రిక పొందుతున్న పాఠకులకు సంవత్సరం ముగిసిన వెంటనే వారికి పత్రిక నిలిపివేయడం జరుగుతుంది. కాబట్టి ముందు గానే సంవత్సర చందా రూ.200/- కట్టి రెన్యువల్ చేసుకోవడం ద్వారా 2 సంవత్సరాలు పత్రిక పంపబడుతుంది. పాఠకులు సహృదయంతో అర్థం చేసుకొని వెంటనే సంవత్సర చందా పంప గలరు. -ఎడిటర్**

# గొఱ్ఱెల కాపరులు

యేసు జన్మించుటకు ఏడు శతాబ్దాలకు ముందే ప్రవక్తయైన మీకా– ఆయన బేత్లెహేములో జన్మిస్తాడని ప్రవచించాడు. నజరేతు వారైన మరియమ్మ, యోసేపులు ప్రధానం చేయబడిన తర్వాత వారు నజరేతులో కాపురమున్నట్లయితే ఈ ప్రవచనము ఎలా నెరవేరుతుంది?


రోమా పట్టణంలో వున్న అగస్టస్ సీజర్ చక్రవర్తి తన సామ్రాజ్యమంతటిలో జనాభా లెక్క సేకరించవలసినదని ఆదేశించాడు. కాని జనాభా లెక్కకు యూదులు వ్యతిరేకులై నందువలన, యూదయలో జనాభా లెక్కలు సేకరించటానికి సంకోచించారు. నాటి ప్రపంచమంతటను ఈ పని జరిగింది. యోసేపు దేవదూత దూత ద్వారా కలలో చెప్పబడిన ప్రకారము మరియమ్మను తన ఇంట చేర్చుకున్నాడు.



జనాభా లెక్క పురుషులకేగాని స్త్రీలకు కాదు. కనుక యోసేపు ఒక్కడే యూదయ లోని బేత్లెహేమునకు వెళ్ళి జనసంఖ్యలో పాల్గొని నజరేతు రావచ్చును. కాని మరియ మీద నజరేతులో రేగిన దుమారం, నిందను భరించలేక ఇక ఎన్నటికిని నజరేతు రాకుండా బేత్లెహేములోనే కాపురముండవలెనని జనాభా లెక్కల్లో పాల్గొనుటకు మరియతో కలసి బేత్లెహేము వచ్చి సత్రంలో నివాసం చేశాడు. వారు బేత్లెహేములో ఉన్నప్పుడు ఆమె ప్రసవ దినములు నిండినవి. ఆమె ప్రసవించటానికి సత్రంలో స్థలం లేనందున పశులపాక శుభ్రం చేస్తే, మరియ పశులపాకలో పురుడు పోసికొన్నది.

బేత్లెహేము గ్రామం యెరూషలేముకు ఆరు మైళ్ళ దూరంలో దక్షిణంగా ఉన్నది. యెరూషలేము దేవాలయంలో ఉదయ సాయంకాల బలి అర్పణ కార్యక్రమము కొరకైతేనేమి, దేవాలయములో ప్రతినిత్యం అర్పించబడు అనేక రకాలైన బలులకు కావలసిన పశువులు, గొఱ్ఱెలు, మేకలు మాజీ ప్రధాన యాజకుడు, నాటి ప్రధానయాజకుడైన కయప మామ అయిన అన్నా ద్వారా నడిపించబడుచున్న 'అన్నాబజారు'లని పిలువబడు గొఱ్ఱెల వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా నడిపించబడుతుంది.

దేవాలయమునకు సంబంధించిన పశువులను బేత్లెహేము, యెరూషలేమునకు మధ్యనున్న పొలములలో యౌవనులైన యాజకులు లేక వేదాంత విద్యార్థులు ఈ పశువులను రాత్రి జామున పొలములో కాపు కాసేవారు. ఈ పశువుల మందలు ఎన్ని ఉన్నాయో మనకు తెలియదు కానీ, ఒక గుంపు వారి యొద్దకు మాత్రము ప్రభువు దూత పంపబడినాడు. అంతేకాదు మహిమ వారి చుట్టూ ప్రకాశించింది. ప్రభువు మహిమ వారి యొద్దకు వచ్చిందంటే అది చిన్న విషయం కాదు. ఈ పశువుల కాపరులు మనము చెప్పుకుంటున్నట్లు వెఱ్ఱివారు కారు. విద్యాహీనులు కారు. అటువంటి వారి యొద్ద ప్రభువు మహిమ ప్రకాశించదు.



ప్రభువు మహిమ, షకినా మేఘము, మోషే ప్రత్యక్షపు గుడారము పని పూర్తి చేసిన తర్వాత ఈ మహిమ ప్రత్యక్షపు గుడారమును కమ్మగా యెహోవా తేజస్సు మందిరమును నిండెను. ఆ మేఘము మందిరము మీద నిలుచుట చేత మందిరము యెహోవా తేజస్సుతో నిండెను గనుక మోషే ప్రత్యక్షపు గుడారములోనికి వెళ్ళలేదు, వెళ్ళలేకుండెను. తరువాత సొలొమోను దేవాలయం కట్టుట పుర్తిచేసి ప్రతిష్ఠించిన తర్వాత ఒక మేఘం యెహోవా మందిరం నిండానిండెను. యెహోవా తేజస్సుతో దేవుని మందిరం నిండుకొనగా సేవ చేయుటకు యాజకులు ఆ మేఘమున్న చోట నిలువలేకపోయిరి.

ఇప్పుడు ఈ పశువుల కాపరులు యధార్థముగా మెస్సయ్య కొరకు ఎదురు చూచుచున్న యాజక విద్యార్థులు. లూకా 2:8–20 వరకు చదివినట్లయితే "కొందరు గొఱ్ఱెల కాపరులు పొలములో రాత్రివేళ తమ మందను కాచుకొనుచుండగా" ఇక్కడ గొఱ్ఱెల కాపరులు రాత్రివేళ ఏ గొఱ్ఱెల మందను కాయుచున్నారు? గొఱ్ఱెలను పాపపరిహార్థబలిగా ఇచ్చేవారు. బలికి అర్పించిన గొఱ్ఱెలను యెరూషలేము, బేత్లెహేము చుట్టుప్రక్కల నుండి తెచ్చిన గొఱ్ఱెలను బేత్లెహేమునందు మేపబడి వాటిని దేవాలయంలో బలి అర్పించాలి. బలి ఇవ్వడానికి సిద్ధమవుతున్న గొఱ్ఱెలను మేపు గొఱ్ఱెల కాపరుల యొద్దకు దేవుని దూత

వచ్చి బలి అర్పణగా గొఱ్ఱెలకు బదులుగా దేవుని కుమారుడు మెస్సయ్య పుట్టియున్నాడను సువార్తను తెలియజేసెను. ప్రభువు దూత వారి యొద్దకు వచ్చి నిలిచి "ఇదిగో ప్రజలందరికి కలుగ బోవు మహా సంతోషకరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు" అని చెప్పి వారికి ఒక ఆనవాలు ఇచ్చినట్లు చూస్తాము. ఒక శిశువు పొత్తి గుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొని యుండుట మీరు చూచెదరు అను ఆనవాలు వారికి ఇచ్చెను. ఈ చిన్న ఆనవాలు పట్టుకొని బేత్లెహేములో ఆ శిశువును వెదకుట చాలా కష్టము. అయితే ఆ గొఱ్ఱెల కాపరులు ప్రభువు దూత మాటలయందు విశ్వాసముంచి, మనము బేత్లెహేము వరకు వెళ్ళుదము రండని యొకనితోనొకడు చెప్పుకొని త్వరగా వెళ్ళి మరియను, యోసేపును, తొట్టిలో పండుకొనియున్న శిశువును చూచిరి. తర్వాత ఈ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు, వారికి దూత ద్వారా చెప్పబడిన మాటలు "నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు" అను సువార్తను ప్రచురము చేసిరి. ప్రభువు దూత ద్వారా తమకు చెప్పబడిన మాటను గొఱ్ఱెల కాపరులు ప్రచురము చేసిరి.

భూమిపై యేసయ్య జననమును గూర్చిన వార్త ప్రచురము చేసిన వారు గొఱ్ఱెల కాపరులు. దేవుడు తన కుమారుని జననమును గూర్చిన వార్త భూమిపై ప్రకటించుటకు అధి కారంలో ఉన్నవారికి, విద్యావంతులకు, ధనికులకు మత నాయకులకు ఇవ్వలేదు. ఈ సువార్తను విన్న మనము కూడా గొఱ్ఱెల కాపరులవలె త్వరగా వెళ్ళి మనకు ఇవ్వబడిన యేస య్యను గూర్చిన ఆనవాలు – వారికి పొత్తిగుడ్డలతో చుట్టబడిన శిశువు ఒక్కటే ఆనవాలు. అయితే మనకు దేవదూత గొఱ్ఱెలకు చెప్పటం, గొఱ్ఱెల కాపరులు ఆ శిశువును చూడగలగటం తూర్పు దేశమున ఉదయించిన నక్షత్రము, యేసయ్య సిలువ మరణ, పునరుత్థానము ఇవన్నీ ఆనవాళ్ళుగా ఉన్నాయి. ఈ ఆనవాళ్ళ ద్వారా మన హృదయంలో, ఆత్మలో ఆయనను వెదకి మన హృదయాలలో ఆయన పుట్టునట్లుగా దేవుని అడుగుదాం. ఈ సువార్త "మీ కొరకు పుట్టియున్నాడు" అని ప్రచురము చేయుచు అనేక హృదయాలలో యేసు పుట్టునట్లు ప్రకటిద్దాం. ఆచారముగా సంప్రదాయంగా సంవత్సరమునకు ఒక క్రిస్మస్ కాక అనేకమంది హృదయాలలో యేసు పుట్టునట్లు చేసి పుట్టినప్పుడల్లా క్రిస్మస్ చేయుచూ అనేక క్రిస్మస్‌లు చేయాలని ఆశిద్దాం. మెస్సయ్య రాక కొరకు ఎదురు చూచు వారికి మెస్సయ్య మీ కొరకు పుట్టియున్నాడని ప్రకటిద్దాం.

# నడచి వచ్చింది క్రిస్మసమ్మ


**ఎందుకమ్మ పండుగమ్మా**
**మళ్ళీ ఎందుకొచ్చావమ్మా**
**ఎవర్ని ఉద్ధరిద్దామని**
**రెండు వేల సంవత్సరాలుగా**
**నడిచి నడిచి నీనడ్డి విరిగి ఉండాలి**
**ముక్కుతూ మూల్గుతూ**
**ముని ముని ముని ముని**
**మనుమడి పెళ్ళికొచ్చినట్లు**
**అంతదూరం నుండి ఇంతదూరం వరకు**
**ఎందుకాశ్రమ నీకు**
**ఏమి ఆశించి వస్తున్నావో తెలియదు**
**నువ్వొచ్చావని, నడిచొచ్చావని**
**ఎవరైనా, ఒకరైనా పులకిస్తారా! పలకరిస్తారా!**
**ఎవరి కొత్తబట్టల్లో వారు**
**ఎవరి వరి పొలాలులో వారు**
**ఎవరి ఫలసాయంలో వారు**
**ఎవరి పలావులో వారు**
**నిన్నెవరు పట్టించుకుంటారమ్మ**
**మీ కోసం దేవుణ్ణి తెచ్చానంటావు**
**మృత్యుంజయుడిగా ఆయన్ని చేశానంటావు**
**ఎవరూ పట్టించుకోరు నిన్ను**
**సువార్తమ్మా నీకు**
**సుస్తీ చేసిందని విన్నాం**
**కర్ర పట్టుకొని ముక్కుతూ మూల్గుతూ**
**ప్రతి యేటా పండగ సందడికి**
**కుంటుకుంటూ వచ్చిపోతుంటావు**
**మా మనుష్యులు మారరు**
**చేరరు నీ దరికి**
**బాలయేసుడు మరల**
**ఱేడై వచ్చువరకు**

సహజకవి
డా.ఎన్. జయకుమార్‌రావు, విశాఖపట్నం

## ఈ నెల ప్రశ్న -డిసెంబర్-2017

**సొలొమోను సేవకుడైన యరొబాము తల్లి పేరు ఏమిటి?** (1రాజులు)

(రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.125/-లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

### నవంబర్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు

జవాబు : ఎల్హానాను (2సమూయేలు 21:19)

1) యన్. ప్రేమలత, కడప 2) కె.లక్ష్మీప్రియ, ఒంగోలు 3) శ్రీమతి వి.శారాభాయి, భీమవరం, 4) శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ, కృష్ణాజిల్లా 5) యం. విక్టోరియారాణి, యర్రగొండ పాలెం, ప్రకాశంజిల్లా 6) శ్రీ టి. చిన్నా, గొల్లపాలెం, మల్కీపురం (మం), తూ.గో.జిల్లా 7) శ్రీ పి.చిన్నారావు,విజయవాడ, కృష్ణాజిల్లా 8) కె. యెషయా, రామగోపాలపురం, ప్రకాశంజిల్లా 9) పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా 10) జి.రోజమ్మ, ప్రసాద్‌నగర్, వేటపాలెం, ప్రకాశంజిల్లా 11) యం. శ్రీకర్‌కుమార్, జుజ్జూరు, కృష్ణాజిల్లా 12) శ్రీమతి సి.హెచ్. సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా 13) సి. షెఫెలా, దొనకొండ, ప్రకాశం జిల్లా 14) కె. జయరాములు, కాకినాడ, ప.గో.జిల్లా 15) బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరుజిల్లా 16) కె. వీరమ్మ, గోగులమూడి, గుంటూరుజిల్లా

లక్కిడిప్ ద్వారా **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అను పాటల పుస్తకమును బహుమతిగా పొందిన వారు :

**సి. షెఫెలా, దొనకొండ, ప్రకాశం జిల్లా**

### బైబిల్ క్విజ్ - 35 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

1) **కె.సుభద్ర,** కస్తూరిభాపేట, విజయవాడ, కృష్ణా జిల్లా
2) **యం.విక్టోరియారాణి,** గోళ్ళవిడిపి, యర్రగొండపాలెం
3) **పి. చిన్నారావు,** విజయవాడ, కృష్ణా జిల్లా
4) **కె. లక్ష్మిప్రియ,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
5) **కె. జయరాములు,** కాకినాడ, ప.గో.జిల్లా
6) **టి. చిన్నా,** గొల్లపాలెం, మల్కీపురం (మం), తూ.గో.జిల్లా
7) **శ్రీమతి వి. శారాభాయి,** భీమవరం, ప.గో.జిల్లా
8) **శ్రీమతి ఎన్. ప్రేమలత,** కడప
9) **జి. రోజమ్మ,** ప్రసాద్‌నగర్, వేటపాలెం, ప్రకాశంజిల్లా
10) **యం.శ్రీకర్‌కుమార్,** జుజ్జూరు, వీరులపాడు(మం), కృష్ణాజిల్లా
11) **పి. దేవదానం,** పెదదోర్నాల, ప్రకాశంజిల్లా
12) **కె. వాణికుమారి,** చీరాల, ప్రకాశంజిల్లా
13) **జె.డి. సుహాసిని,** రాజమండ్రి, తూ.గో.జిల్లా
14) **వి. అన్నామణి,** గుంటూరు
15) **పి. స్పందన,** హైదరాబాద్
16) **సి.హెచ్. సుభాషిణి,** గుడివాడ, కృష్ణా జిల్లా
17) **కె. అప్పలస్వామి,** దాకమర్రి, విశాఖపట్నం జిల్లా
18) **పి. బుల్లిరెడ్డి,** పెద్దాపురం, తూ.గో.జిల్లా
19) **శ్రీమతి గ్రేస్‌మంజుల,** బెంగుళూరు
20) **యం. సుజాత,** పెనమలూరు, కృష్ణా జిల్లా
21) **కె. వీరమ్మ,** గోగులమూడి, గుంటూరు జిల్లా
22) **బి. ఎస్తేరురాణి,** గోగులమూడి, గుంటూరు జిల్లా
23) **సి.హెచ్. దేవదానం,** చెన్నై

లక్కిడిప్ ద్వారా **"నా కుమారి"** అను పుస్తకమును బహుమతిగా పొందిన వారు :

**జె.డి. సుహాసిని,** రాజమండ్రి, తూ.గో.జిల్లా

## బైబిల్ క్విజ్ - 35 జవాబులు

**1.** భక్తిహీనుల (కీర్తనలు.112:10) **2.** దరిద్రులను (113:8) **3.** చెకుముకి రాతిబండను (114:8) **4.** నరులకు (115:16) **5.** విలువగలది (116:15) **6.** నిరంతరము (117:1) **7.** నీతిమంతుల (118:15) **8.** కీర్తనలు 119:105 **9.** సమాధానమే (120:7) **10.** కీర్తనలు 121:5 **11.** యెరూషలేము యొక్క (122:6) **12.** గర్విష్ఠుల (123:3) **13.** సహాయము (124:8) **14.** నీతిమంతుల (125:3) **15.** గొప్ప కార్యములు (126:3) **16.** తన ప్రియులు (127:2) **17.** సీయోనులో నుండి (128:5) **18.** భక్తిహీనులు (129:4) **19.** కృప (130:7) **20.** ఇశ్రాయేలుకు (131:3)



# అక్షరయజ్ఞం

## క్రిస్మస్ స్పెషల్ బైబిల్ క్విజ్

మత్తయి, మార్కు, లూకా, సువార్తల నుండి



**శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్**

1. మత్తయి సువార్తలోని ఇమ్మానుయేలు అను పేరు యెషయా గ్రంథములో ఏ అధ్యాయంలో ఉంది? (మత్తయి)
2. యేసుప్రభువు ఎక్కడ నుండి వచ్చి బాప్తిస్మము తీసుకున్నాడు? (మార్కు)
3. మరియ ఎలీసబెతుతో ఎంతకాలము ఉండెను? (లూకా)
4. పేతురు, అంద్రెయల పట్టణము ఏది? (యోహాను)
5. బాలుడైన యేసుని చంపజూచిన హేరోదు కుమారుని పేరేమిటి? (మత్తయి)
6. యేసుప్రభువు శిష్యుడైన లేవి తండ్రి పేరేమిటి?(మార్కు)
7. అన్న అను ప్రవక్త్రి యొక్క తండ్రి పేరేమిటి?(లూకా)
8. ఒకడు క్రొత్తగా జన్మించితేనేకాని అతడు దేవుని రాజ్యమును చూడడు అని యేసు ఎవరితో చెప్పెను? (యోహాను)
9. మత్తయి 4:4ను పోలిన వచనము ద్వితీయోపదేశ కాండములో ఎక్కడ ఉన్నది? (మత్తయి)
10. సేన అను దయ్యము పట్టిన వాడు స్వస్థత పొందిన తరువాత ఎక్కడ ఆ కార్యమును గూర్చి ప్రకటించెను?
11. శతాధిపతి యొక్క ప్రియుడైన దాసుని స్వస్థపరచిన తర్వాత యేసు ఏ ఊరికి వెళ్ళెను? (లూకా)
12. 5000 వేలమందికి పంచి పెట్టిన రొట్టెలు దేనితో (ఏ పిండితో) చేయబడినవి? (యోహాను)
13. అబ్రాహాము మొదలుకొని క్రీస్తు వరకు మొత్తం ఎన్ని తరములు? (మత్తయి)
14. పిల్లల రొట్టె తీసికొని కుక్కపిల్లలకు వేయుట యుక్తము కాదు అని యేసు చెప్పిన స్త్రీ ఏ దేశస్తురాలు? (మార్కు)
15. "ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను" అని యేసు ఎవరి గురించి ఎవరితో చెప్పెను? (లూకా)
16. లాజరు చనిపోయిన ఎన్ని దినములకు యేసు బేతనియ వెళ్ళెను? (యోహాను)
17. అర షెకెలు అను పన్నును యేసు తనతో పాటు ఉన్న ఏ శిష్యునికి చెల్లించమని చెప్పెను? (మత్తయి)
18. యేసుప్రభువు శిష్యులైన యాకోబు, యోహానుల తండ్రి పేరు ఏమిటి? (మార్కు)
19. యేసును చూచుటకు జక్కయ్య ఏ చెట్టు ఎక్కెను? (లూకా)
20. "ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తము" అని చెప్పిన ప్రధాన యాజకుని పేరు ఏమిటి? (యోహాను)

**గమనిక :–** మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"క్రిస్మస్ స్పెషల్ బైబిల్ క్విజ్"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి**
**"సువార్తలలోని యేసుకథ"**
**అను మూడు భాగముల మూడు పుస్తకములు (రూ. 225/-) లక్కిడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

**సీరియల్ నంబరు** మరియు మీ **ఫోన్ (మొబైల్) నంబరు** తప్పని సరిగా వ్రాయాలి. లేనిచో జవాబులు అంగీకరించబడవు.

## చందాదారుల వివరాలు

| | |
|---|---|
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. 1,200 |
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. 1,000 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. 1,000 |
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 500 |
| శ్రీమతి కె.లూథియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. 500 |
| పేరు తెలీదు (బ్యాంక్ అకౌంట్ ద్వారా అక్టో.12వ తేది) | రూ. 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం (సెప్టెంబర్-17) | రూ. 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. 300 |
| శ్రీ బాలాజీరావు సింధియా, వైజాగ్ | రూ. 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కిపురం, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. 200 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. 200 |
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నంజిల్లా | రూ. 200 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యగూడెం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. 150 |
| పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జద్చర్ల | రూ. 150 |
| పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట | రూ. 150 |
| శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. 150 |
| పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. 150 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. 150 |
| పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా | రూ. 150 |
| శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా | రూ. 150 |
| శ్రీమతి పి. విజయలక్ష్మి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా | రూ. 150 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. 150 |
| శ్రీ టి. సునీల్‌కుమార్, కోవెరపాలెం, నెల్లూరుజిల్లా | రూ. 150 |
| శ్రీమతి వై. కెజియాసత్యసారధి, హైదరాబాద్ | రూ. 150 |
| వి. మేరినిర్మల, మెట్రోపొలిటన్ మిషన్, విజయవాడ | రూ. 150 |
| పాస్టర్ బి. జకర్యా, రావిపాడు, ప్రకాశం జిల్లా | రూ. 100 |

**నవంబరు నెలలో చందాకట్టిన వారు**

| | |
|---|---|
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. 1000 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. 500 |
| శ్రీ బాలాజీరావు సింధియా, వైజాగ్ | రూ. 300 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. 200 |

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము**